ఆదివారం
30-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 307
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నజారత్‌లో కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంపై
ఇజ్రాయిల్ పోలీసుల దాడి

నజారెత్‌లోని కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యాలయంపై ఇజ్రాయిలీ సరిహద్దు పోలీసు దళం దాడులు జరిపింది. పాలస్తీనా జెండాను తొలగించాలని ఆదేశించింది. పోలీసులు భవనం లోపలికి వెళ్లకుండా కమ్యూనిస్టు పార్టీ సభ్యులు అడ్డుకోగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

2 లో

వెనక్కి తగ్గని రెజ్లర్లు

పెరుగుతున్న రాజకీయ మద్దతు

నిర్దోషినంటున్న బ్రిజ్‌భూషణ్

న్యూఢిల్లీ: భారత రెజ్లర్లు తమ ఆందోళనను ఉధృతం చేస్తున్నారు. వారి ఆందోళనకు రాజకీయ మద్దతు పెరుగుతోంది. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా స్థలికి పార్టీలకు అతీతంగా నాయకులు చేరుకొని సంఘీభావం తెలుపుతున్నారు. శనివారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తదితరులు వచ్చి నిరసనకారులను కలిశారు. బ్రిజ్‌భూషణ్ తొలగించి రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్, సీపీఎం నేత బృందా కారత్, హరియాణా మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా, రైతు నాయకుడు రాకేశ్ తికైత్, ఖాప్ పంచాయత్ నేతలు తదితరులు రెజ్లర్లను కలిసి మద్దతు ప్రకటించిన విషయం విదితమే. బీజేపీ ఎంపీ కూడా అయిన బ్రిజ్ భూషణ్‌కు కేంద్రప్రభుత్వ అండదండలు ఉన్నాయని,

ఆయనను కాపాడేందుకు సర్కార్ యత్నిస్తోందని ప్రియాంక వ్యాఖ్యానించారు. రెజ్లర్లను ఒత్తిడికి గురిచేయడం, వేధించడం, వారి కెరీర్‌ను నాశనం చేస్తుండటం ఎలా సమర్థనీయమని ప్రశ్నించారు. జాతీయ స్థాయి మహిళా రెజ్లర్లు ఏడుగురిని లైంగికంగా వేధించిన వ్యవహారంలో ఎలాంటి విచారణను ఎదుర్కొనేందుకైనా తాను సిద్ధంగా ఉన్నట్లు డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తెలిపారు. రాజీనామా మాత్రం చేసేది లేదని తెగేసి చెప్పారు. రాజీనామా చేయడమంటే ఆ ఆరోపణలు నిజమని ఒప్పుకోవడమే అవుతుందన్నారు. ఈ వివాదం వెనుకున్నదెవరో నేడు తేలిపోయిందని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో ఓ పారిశ్రామికవేత్త, కాంగ్రెస్ హస్తం ఉన్నదని మొదటి నుంచి చెబుతూనే ఉన్నానన్నారు.

ఐక్యపోరాటం?

చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ

గంటకుపైగా ఏకాంత చర్చలు

వరుస భేటీలపై రాజకీయవర్గాల్లో చర్చ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుతో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శనివారం మరోసారి భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసానికి వచ్చిన పవన్ కల్యాణ్ దాదాపు గంటకుపైగా ఏకాంతంగా చర్చలు జరిపారు. టీడీపీ, జనసేన మధ్య పొత్తు ఉంటుందని జోరుగా ప్రచారం సాగుతున్న తరుణంలో చంద్రబాబుతో పవన్ భేటీ వరుస భేటీలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, వైసీపీ ప్రభుత్వ విధానాలపై రెండు పార్టీలు ఐక్యంగా ఎలా ముందుకెళ్లాలనే అంశంపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. పొత్తులపై ఇప్పటికిప్పుడు స్పష్టమైన నిర్ణయం ప్రకటించకపోయినప్పటికీ రాజకీయంగా ఎలా ముందుకెళ్లాలనేదానిపై సమాలోచనలు జరిపినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వం సోషల్ మీడియాను ఉపయోగించి రెండు పార్టీల మధ్య విభేదాలు తలెత్తేలా చేస్తున్న ప్రయత్నాలు, పొత్తు కుదరకుండా చేస్తున్న కుట్రలు చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. బీజేపీ వైఖరి ఎలా ఉండబోతోంది? ఇటీవల ఢిల్లీలో కేంద్ర నేతలతో జరిగిన భేటీలో చర్చకొచ్చిన అంశాలు, రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వస్తే అనుసరించాల్సిన వ్యూహాలపైనా చంద్రబాబు, పవన్ చర్చించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వబోమని ఇప్పటికే పవన్ కల్యాణ్ వివిధ సందర్భాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవలి కాలంలో ఇద్దరు నేతలూ భేటీ కావడం ఇది మూడోసారి. విశాఖలో పవన్ కల్యాణ్‌ను పోలీసులు అడ్డుకున్న సందర్భంగా ఆయనకు మద్దతు తెలిపేందుకు విజయవాడలోని నోవాటెల్ హోటల్‌కు వెళ్లి చంద్రబాబు కలిశారు. ఆ తర్వాత కుప్పం పర్యటనలో పోలీసులు చంద్రబాబు పట్ల దురుసుగా వ్యవహరించిన తీరుపై పవన్ స్పందించారు. చంద్రబాబు నివాసానికి వెళ్లి పరామర్శించడంతో పాటు ప్రభుత్వ నియంతృత్వ విధానాలపై చర్చించారు. తాజాగా శనివారం రెండుపార్టీల అగ్రనేతలు భేటీ కావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

కర్నాటకలో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం

అత్యంత అధ్వాన స్థితిలో కమలం పార్టీ

ఓపీనియన్ పోల్స్‌లో వెల్లడి

2 లో

'హెచ్1బీ' లాటరీ విధానంలో మోసాలు

వాషింగ్టన్: హెచ్-1బీ వీసాదారుల ఎంపికకు వినియోగించే కంప్యూటరైజ్డ్ లాటరీ విధానంలో మోసాలు జరుగుతున్నట్లు అమెరికా గుర్తించింది. ప్రతి ఏడాది కొన్ని లక్షల మంది ఈ వీసాల కోసం దరఖాస్తు చేసుకుంటారు. కంప్యూటరైజ్డ్ లాటరీ విధానం అర్హులను ఎంపిక చేసి వీసాలు జారీ చేస్తారు. ఈ ప్రక్రియలో కొన్ని కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నాయని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ గుర్తించింది. దీనిపై దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించింది. తప్పుడు సమాచారంతో దరఖాస్తులు చేసుకునేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. 'మా వలస వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థకు హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ ముఖ్యమైనది. ఈ ప్రక్రియలో మోసాలు, దుర్వినియోగాన్ని తగ్గించేందుకు నమోదు విధానాన్ని మరింత బలోపేతం చేస్తాం' అని వెల్లడించింది. వీసాలను దక్కించుకునే అవకాశాలను పెంచుకోవడం కోసం కొన్ని కంపెనీలు ఒకే పేరుతో అనేక దరఖాస్తులు నమోదు చేస్తున్నట్లు గుర్తించామని యూఎస్‌సీఐఎస్ తెలిపింది. 2024 ఆర్థిక సంవత్సరానికి నమోదు ప్రక్రియను ఇటీవల చేపట్టగా గతంలో కంటే ఎక్కువగా దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొంది. 'హెచ్-1బీ వీసాల కోసం ఈ ఏడాది కంప్యూటర్ జనరేటెడ్ లాటరీలో ఏకంగా 7,80,884

- మిగతా 2 లో

రాహుల్ కేసు 2న విచారణ

ఆరోపణలు తీవ్రమైనవి కాదు... బెయిల్ ఇవ్వండి: న్యాయవాది సింఘ్వీ

అహ్మదాబాద్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పరువునష్టం కేసులో సూరత్ కోర్టు తీర్పుపై స్టే కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మే 2వ తేదీకి గుజరాత్ హైకోర్టు వాయిదా వేసింది. రెండు పక్షాల వాదనను అదేరోజు వింటామని న్యాయస్థానం పేర్కొంది. ప్రజాప్రతినిధిగా రాహుల్‌గాంధీ చేసే ప్రకటనలు నిర్దిష్ట పరిమితులు లోబడి ఉండాలని కేసు విచారణ సందర్భంగా జస్టిస్ హేమంత్ ప్రచ్చక్ అన్నారు. రాహుల్ తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, రాహుల్‌పై తీవ్ర ఆరోపణలు

- మిగతా 2 లో

పోరాటాలతోనే హక్కుల సాధన

- మచిలీపట్నం ధర్నాలో ఆర్.రవీంద్రనాథ్, బొప్పరాజు పిలుపు
- గ్రామ,వార్డు, సచివాలయ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

విశాలాంధ్ర-నెట్‌వర్క్: విధుల్లోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా క్రమబద్ధీకరించకపోవడాన్ని నిరసిస్తూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు శనివారం రాష్ట్ర వ్యాపితంగా ఆందోళన నిర్వహించారు. వెంటనే రెగ్యులర్ చేయాలనీ, సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధనకు జరిగే పోరులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనీ, అప్పుడే ప్రభుత్వం మెడలు వంచగలమని నాయకులు పేర్కొన్నారు.

కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నం ధర్నాచౌక్‌లో జరిగిన ఆందోళనలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులుగా హక్కుల సాధనకు కలిసికట్టుగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉద్యోగ సంఘాల మధ్య చీలిక తీసుకురావడానికి విశ్వ ప్రయత్నం చేస్తోందని, ఆ కుటిల యత్నాలను గమనించి ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. న్యాయమైన ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం స్పందించకపోవడం, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోవడం దుర్మార్గమన్నారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా ఉందంటూనే, వేతనాలు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితులు కల్పిస్తూ ఉద్యోగులను ఇబ్బందిపెట్టడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బేషజాలకు పోకుండా ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం తప్పదని రవీంద్రనాథ్ హెచ్చరించారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మొదటి విడతలో కోల్పోయిన 9 నెలల కాలానికి, రెండో విడత కోల్పోయిన 5నెలల కాలానికి సంబంధించిన ఆర్థిక,ఆర్థికేతర అంశాలకు సంబంధించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరికి కూడా సాధారణ బదిలీల సౌకర్యం కల్పించాలని, ఏపీజీఎల్ఐ బాండ్లు వెంటనే జారీ చేయాలని, సీపీటీ పరీక్షలు నిర్వహించి ప్రొబేషన్ డిక్లేర్ చేయాలనని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాల వల్ల విసిగి వేసారి పోయామని అందువల్లే ఈ పోరాటం కొనసాగిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగస్తుల నాయకులే కాకుండా కింద స్థాయి ఉద్యోగులు కూడా ఈ పోరాటాల పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నో దఫాలుగా మన

- మిగతా 2 లో

రైతులకు రాయితీ ఎందుకివ్వరు?

మోదీ సర్కారును నిలదీసిన నారాయణ

విశాలాంధ్ర- హైదరాబాద్: బీజేపీ హటావో-దేశ్ బచావో నినాదంతో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో భాగంగా శనివారం నిజాం కళాశాల నుండి మోంజా మార్కెట్ వరకు కరపత్రాలు పంచుతూ ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ 26 రాష్ట్రాలలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం కొనసాగిస్తున్నామని, మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ఆకాశాన్ని అంటుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, మత విద్వేషాలు, నిరుద్యోగం, ప్రభుత్వ సంస్థలు ప్రైవేటుపరం, ప్రభుత్వరంగం విధ్వంసం వంటి అంశాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. కార్పొరేట్ సంస్థలకు రూ.10 లక్షల కోట్ల రాయితీలిచ్చిన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇదే సార్ ఆయన దారి!

విపక్షాల ఐక్యతే లక్ష్యం

కర్నాటక ఎన్నికల తర్వాత ప్రతిపక్షాల భేటీ: నితీశ్‌కుమార్ వెల్లడి

పాట్నా: కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత పాట్నాలో ప్రతిపక్ష పార్టీల నాయకుల సమావేశం ఉంటుందని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ శనివారం చెప్పారు. జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలంతా కర్నాటక ఎన్నికల హడావుడిలో ఉన్నారని తెలిపారు. ఆ సమావేశంలో ప్రతిపక్షాల ఐక్యతకు సంబంధించిన అనేక అంశాలను చర్చిస్తామని జేడీయూ అధినేత కూడా అయిన నితీశ్ చెప్పారు. 'మేమంతా కచ్చితంగా సమావేశమవుతాం. 2024 ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడానికిగాను ప్రతిపక్ష పార్టీలు కూటమిగా ఏర్పడాల్సిన అవసరంపై కూలంకషంగా చర్చిస్తాం. ప్రస్తుతం కొంతమంది కర్నాటక ఎన్నికల్లో బిజీగా ఉన్నారు. ఆ ఎన్నికలు పూర్తయితే మా సమావేశం వేదికను నిర్ణయిస్తాం. పాట్నాలోనే సమావేశం ఏర్పాటు చేద్దామని అందరూ అనుకుంటే ఇక్కడే కూర్చుకుంటాం. పాట్నాలో ప్రతిపక్ష పార్టీల

- మిగతా 2 లో

కిడ్నీల అపహరణ సూత్రధారి అరెస్టు?

ముఠా ఆగడాలపై పోలీసు దర్యాప్తు ముమ్మరం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖలో కలకలం సృష్టిస్తోన్న కిడ్నీ రాకెట్ వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. విశాఖ క్రైం బ్రాంచ్ పోలీసులు బాధితులను ప్రేరేపించిన ముఠా సభ్యులు, అనుమతి లేకుండా చికిత్స చేసి వ్యవహారాన్ని నడిపించిన వైద్యులను ఒక్కొక్కరిగా అదుపులోకి తీసుకుంటున్నారు. ఈ ఆపరేషన్లు చేసిన డాక్టర్ కార్పొరేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయన కాకినాడలో ఉన్నారన్న సమాచారంతో రెండు ప్రత్యేక బృందాలు అక్కడికి వెళ్లాయి. విశాఖ సీసీఎస్ డీసీపీ ఆనంద్‌రెడ్డి నేతృత్వంలోని బృందం కిడ్నా రాకెట్ సభ్యులు కనకరాజు, శ్రీను, ఇలియానాతో పాటు మరికొంతమందిని ప్రశ్నిస్తున్నది. వారి నుంచి సమాచారం రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితులను ట్రాప్ చేయడం మొదలు...కిడ్నీ ఆపరేషన్లు చేసే వరకు జరిగిన క్రమంపై పోలీసులు ఆరాతీస్తున్నారు. పెందుర్తిలోని తిరుమల ఆస్పత్రిలో కిడ్నీ శస్త్ర చికిత్సలు జరిగాయని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తిరుమల ఆస్పత్రి యజమాని డాక్టర్ పరమేశ్వరరావును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోలీసులు అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, ఒంటరి మహిళలు, పేద

- మిగతా 2 లో

ఉ.కొరియాకు అమెరికా ప్రధాన ముప్పు: డబ్ల్యూపీసీ

ఏథెన్స్: ఉత్తర కొరియాను అంతం చేస్తామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హెచ్చరించడాన్ని ప్రపంచ శాంతి సంఘం (డబ్ల్యూపీసీ) తీవ్రంగా ఖండించింది. ప్రతి దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను ప్రపంచ శాంతి సంఘం సమర్థిస్తుందని, కొరియా ద్వీపకల్పం శాంతియుత ఏకీకరణకు మద్దతిస్తుందని తాజా ప్రకటన పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అణు నిరాయుధీకరణకు కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. అమెరికా తీరును తీవ్రంగా తప్పుపట్టింది. బహిరంగంగానే ఓ దేశాన్ని నామరూపాలు లేకుండా చేస్తామని బైడెన్ హెచ్చరించడాన్ని ఖండించింది. కొరియా ద్వీపం చుట్టుపక్కల ప్రాంతాల్లో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తోంది. బెదిరింపులు, ఆంక్షలతో విరుచుకుపడటమే కాకుండా మిత్రపక్షాలతో కలిసి సైనిక విన్యాశాలు నిర్వహిస్తోంది. డీపీఆర్‌కే, ఆ దేశ ప్రజల సార్వభౌమత్వాన్ని హరించేలా చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా చర్యలు చేపడుతోంది. మిస్సైల్ డిఫెన్స్ షీల్డ్ (థాడ్) పేరిట దక్షిణ కొరియాలో లక్షల మంది సైన్యాన్ని అమెరికా మోహరించింది. భారీగా ఆయుధాలు చేర్చింది. పసిఫిక్ మహాసముద్రంలో ఏడవ యూఎస్ ఫీట్ ద్వార ఆ ప్రాంత శాంతి, భద్రతకు ప్రధాన ముప్పుగా మారింది. 'క్వాడ్రిలేటరల్ (చతుర్ముఖ) సహకారం', ఏయూకేయూఎస్ వంటివి అమెరికా సామ్రాజ్యవాద ప్రణాళికలకు అద్దంపడుతున్నాయి.

నజారత్‌లో కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంపై
ఇజ్రాయిల్ పోలీసుల దాడి

గోడలెక్కి పలస్తీనా, అరుణపతాకాల తొలగింపు, స్వాధీనం-పార్టీ కార్యదర్శి అరెస్టు

నజారెత్: నజారెత్‌లోని కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యాలయంపై ఇజ్రాయిలీ సరిహద్దు పోలీసు దళం దాడులు జరిపింది. పాలస్తీనా జెండాను తొలగించాలని ఆదేశించింది. పోలీసులు భవనం లోపలికి వెళ్లకుండా కమ్యూనిస్టు పార్టీ సభ్యులు అడ్డుకోగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వారెంట్ లేకుండా తనిఖీలు చేపడటాన్ని కామ్రేడ్లు ప్రశ్నించారు. కానీ పోలీసులు వెనక్కి తగ్గలేదు. అదనపు బలగాలను పిలిపించి గోడలు ఎక్కి పాలస్తీనా జెండాతో పాటు అరుణ పతాకాలను తొలగించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. నజారెత్‌లోని పార్టీ కార్యదర్శిని అదుపులోకి తీసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ జోక్యం చేసుకోవడంతో వెనక్కు తగ్గిన పోలీసు యంత్రాంగం, స్వాధీనం చేసుకున్న అన్ని జెండాలను కేంద్ర కార్యాలయానికి తిరిగిచ్చింది. దీంతో నజారెత్‌లోని సీపీఐ కేంద్ర కార్యాలయాలపై వారి మళ్లీ రెపరెపలాడాయి. ఇజ్రాయిల్ పోలీసుల దమనకాండను కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండించింది. రాజకీయ స్వేచ్ఛను హరిస్తూ నిరంకుశంగా వ్యవహరించడాన్ని దుయ్యబట్టింది. ఉగ్రవాదానికి మద్దతిచ్చినట్లు ఆరోపణలు ఉన్న జాతీయ భద్రతా మంత్రి ఇటామన్ బెన్‌గ్విర్ ఆదేశాల అమలు దిశగా అధికారిక కసరత్తు, కవ్వింపులు జరుగుతున్నట్లు విమర్శించింది. తాజా పరిణామానికి మే ఒకటో తేదీన నజారెత్‌లో ప్రజా నిరసన నిర్వహిస్తామని పార్టీ కేడర్ పేర్కొంది. 'ఫాసిజాన్ని, అణచివేతను, దోపిడీని వ్యతిరేకిస్తున్నాం. శాంతి, సోషలిజం కోసం ఐక్యంగా పోరాడుతాం' అని నినాదమిచ్చింది.

సూడాన్‌కు కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీ సంఘీభావం

ఏథెన్స్: సూడాన్ ప్రజలకు కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు సంయుక్త ప్రకటనలో సంఘీభావాన్ని ప్రకటించాయి. ప్రపంచ శాంతివాదులు సూడాన్‌కు మద్దతివ్వాలని, ఆదేశం కోసం గళమెత్తాలని పిలుపునిచ్చాయి. సూడాన్ ప్రజలు, ప్రజాస్వామ్య శక్తులకు అండగా నిలవాలని, ప్రజాస్వామిక పౌర పరిపాలన ఏర్పాటు పోరాటానికి అండగా నిలవాలని కోరాయి. సూడాన్‌లో యుద్ధాన్ని కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు తీవ్రంగా ఖండించాయి. వందలాది మంది అమయకుల ప్రాణాలు హరించి, వేలాది మందిని గాయపర్చి కేవలం ఆధిపత్యం, స్వార్థపూరిత ఆకాంక్షల కోసం రక్తం చిందిస్తున్న రెండు వర్గాలను దుయ్యపట్టాయి. సూడాన్ ప్రజల ఆశలు, ఆకాంక్షలు, స్వేచ్ఛ, శాంతి, సామాజిక న్యాయాన్ని అణచివేయడంపై ఆవేదన వ్యక్తంచేశాయి. సూడాన్ ప్రజాస్వామిక శక్తులకు సంపూర్ణ మద్దతిను ప్రకటించాయి. తక్షణమే కాల్పుల విరమణ, సైన్యం నిష్క్రమణ, అత్యవసరంగా మానవతా సాయాన్ని ఐరాస పర్యవేక్షణలో పౌరులకు అందించడం వంటి డిమాండ్లకు మద్దతిచ్చాయి. సూడాన్ ప్రజల మానవహక్కుల ఉల్లంఘనలు, యుద్ధ నేరాల బాధితులకు న్యాయం జరగాలని, దోషులను శిక్షించాలని సంయుక్త ప్రకటనలో ది వర్కర్స్ పార్టీ ఆఫ్ బెల్జియం, బ్రెజిల్ కమ్యూనిస్టు పార్టీ, కెనడా కమ్యూనిస్టు పార్టీ, చిలీ కమ్యూనిస్టు పార్టీ, క్రొయేషియా సోషలిస్ట్ వర్కర్స్ పార్టీ, అకెల్ (సైప్రస్), ఈజిప్టు, ఫిన్లాండ్, ఫ్రాన్స్, గ్రీస్, ఇరాక్, ఇజ్రాయిల్, జోర్డాన్, పోర్చుగీస్, కురిస్తాన్-ఇరాక్, స్పెయిన్, కటలోనియా, స్వాజిలాండ్, టర్కీ, పాకిస్తాన్, లెబనీస్ కమ్యూనిస్టు పార్టీలు, ఐర్లాండ్ వర్కర్ల పార్టీ, ఇటలీ రీఫౌండేషన్ కమ్యూనిస్టు పార్టీ, రొమేనియా సోషలిస్ట్ పార్టీ, సిరియా కమ్యూనిస్టు పార్టీ (యూనిఫైడ్) డిమాండ్ చేశాయి.

ఆగని ఐఏఎస్ బదిలీల పర్వం

సీఎస్‌కు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ బాధ్యతలు
బీసీ సంక్షేమశాఖ స్పెషల్ సీఎస్‌గా అనంతరాము

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఐఏఎస్ అధికారుల బదిలీల పర్వం కొనసాగుతోంది. ఇటీవల ఎనిమిది జిల్లాల కలెక్టర్లు సహా దాదాపు 56 మంది ఐఏఎస్ అధికారులకు ఒకేసారి స్థానచలనం కలిగిస్తూ ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో ముగ్గురు ఐఏఎస్‌లను బదిలీ చేసింది. బీసీ సంక్షేమశాఖ స్పెషల్ సీఎస్‌గా అనంతరామును బదిలీ చేశారు. మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా ఎండీ ఇంతియాజ్‌కు పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు. గ్రామ, వార్డు సచివాలయ డైరెక్టర్‌గా లక్ష్మీషాకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. రెవెన్యూశాఖలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇప్పటివరకు ఒకే విభాగంగా ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలు ఉన్నాయి. రెండు శాఖలకూ ఇప్పటివరకు ఒకే అధికారి ఉన్నారు. ఇకపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ బాధ్యతలను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కిడ్నీల అపహరణ సూత్రధారి అరెస్టు?

(మొదటిపేజీ తరువాయి)

కాలనీలకు చెందిన వారినే ఈ ముఠా లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. కిడ్నీ తీసుకోవడం లేదా అద్దె గర్భం దాల్చడానికి అంగీకరిస్తే పెద్దమొత్తంలో డబ్బు ఇస్తామని ఆశ చూపించినట్లు సమాచారం. అవయవదానానికి సంబంధించి అధికారిక ప్రక్రియను పాటించకుండా దొంగ పత్రాలు సృష్టించి అనధికారికంగా శస్త్ర చికిత్సలు చేయిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఎంత మంది బాధితులు ఉన్నారు? ఈ ముఠా సభ్యులు ఏఏ కాలనీలపై దృష్టి పెట్టారు? ఎవరెవరిని సంప్రదించారు? అనే కోణంలో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. బాధితులు పెద్ద సంఖ్యలో ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

ఇంటికెళ్లిన బాధితుడు వినయ్

విశాఖ కిడ్నీ రాకెట్ కేసులో బాధితుడిగా ఉన్న వినయ్‌కుమార్‌ను శుక్రవారం పోలీసులు కేజీహెచ్ యూరాలజీ విభాగంలో చేర్చారు. ఇప్పటి వరకు సిటీ స్కాన్, అల్ట్రా సౌండ్, కొన్ని రక్త పరీక్షలు నిర్వహించారు. ఎమ్మారై స్కాన్ చేయాల్సి ఉంది. ఈ నివేదికలన్నీ వచ్చిన తర్వాత వాటిని సమన్వయం చేసుకొని కిడ్నీ తీసిందీ, లేనిది వైద్యులు నిర్ధారించి పోలీసులకు నివేదిక ఇస్తారు. ఈ తరుణంలోనే వినయ్‌కు ఎలాంటి వైద్యం అందడం లేదని ఆరోపిస్తూ ఆటోలో అతన్ని బంధువులు ఇంటికి తరలించారు. అక్కడే ఉన్న పోలీసులు, వైద్య సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. డిశ్చార్జి పత్రం లేకుండా వినయ్ పరారయ్యారని, ఇదే విషయాన్ని పోలీసులకు చెప్పినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ అశోక్ కుమార్ వెల్లడించారు. కేజీహెచ్‌లోనే మెరుగైన వైద్య సేవలు అందుతాయని, రిపోర్టులు వచ్చాక సరైన వైద్యం అందించేందుకు వైద్యులు సిద్ధమైనప్పటికీ బంధువులు బలవంతంగా వినయ్‌ను తీసుకెళ్లడం సరికాదని అశోక్‌కుమార్ అన్నారు.

కిడ్నీ మోసాలపై నిఘా: మంత్రి రజిని

కిడ్నీ మోసాలపై రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెట్టామని ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ పరిధిలోని పెందుర్తి శ్రీ తిరుమల ఆస్పత్రిలో వెలుగుచూసిన కిడ్నీ రాకెట్ వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని స్పష్టంచేశారు. ఈ ఘటనపై విశాఖ కలెక్టర్, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఆస్పత్రిని మూసివేశారని తెలిపారు. తిరుమల ఆస్పత్రికి అనుమతులే లేవని తేలడంతో యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. తిరుమల ఆస్పత్రి వ్యవహారంలో మధ్యవర్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంపై రాష్ట్రస్థాయిలో కమిటీ వేసినట్లు మంత్రి తెలిపారు.

రైతులకు రాయితీ ఎందుకివ్వరు?

(మొదటిపేజీ తరువాయి)

మోదీ ప్రభుత్వం... రైతులకు లక్ష కోట్ల రూపాయలు ఎందుకు ఇవ్వడం లేదని నారాయణ ప్రశ్నించారు. మతతత్వ శక్తుల నుండి దేశాన్ని కాపాడటానికి మోదీ హటావో-దేశ్ బచావో నినాదంతో ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటి నరసింహ, సీనియర్ నేత ప్రేమ్ పావని, జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.మల్లేశ్, కాంపల్లి శ్రీనివాస్, రాజ్ కుమార్, జెర్రిపోతుల కుమార్, కొమరెల్లి బాబు, ఆర్.బాలకృష్ణ, గ్యార నరేశ్, చైతన్య, కల్యాణ్, రాజు గౌడ్, మహిళా సమాఖ్య నాయకురాలు చక్రి, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

విపక్షాల ఐక్యతే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

నేతల సమావేశం ఏర్పాటు చేయడం సంతోషం' అని నితీశ్‌కుమార్ చెప్పారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ఏప్రిల్ 24న నితీశ్‌కుమార్, ఆర్‌జేడీ నేత తేజస్వియాదవ్ సమావేశమయ్యారు. ఆ సమయంలో పాట్నాలోనే బీజేపీ యేతర పార్టీల నాయకుల సమావేశం ఏర్పాటు చేస్తే మంచిదని మమత సూచించారు. మమత విజ్ఞప్తిని మన్నించిన నితీశ్ పాట్నాలో జరపడానికి సుముఖత వెలిబుచ్చారు. బీజేపీ ప్రభుత్వంపై పోరాడటానికి ఎక్కువ పార్టీలు కలిసి వచ్చేందుకు ప్రయత్నిస్తామని నితీశ్ తెలిపారు. ఇటీవల కాలంలో చాలామంది ప్రతిపక్ష నేతలతో సమావేశమయ్యానని, మరికొన్ని బీజేపీ యేతర పార్టీలతోనూ మాట్లాడతానన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రతిపక్ష పార్టీలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకురావడమే తన లక్ష్యమని నితీశ్ స్పష్టంచేశారు. ఇప్పటికే మమత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తదితరులతో నితీశ్ సమావేశమయ్యారు. వారికంటే ముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీతోనూ చర్చలు జరిపారు. బీహారులో సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ పార్టీలు నితీశ్ కూటమిలోనే ఉన్నాయి. వామపక్షాలు సైతం సుదీర్ఘకాలంగా మోదీ సర్కారుపై పోరాటం చేస్తున్నాయి. విపక్షాల ఐక్యతను ఆకాంక్షిస్తున్నాయి.

పెరుగుతున్న హిందూత్వవాదులు

పేట్రేగిపోతున్న మతవిద్వేషం

న్యూఢిల్లీ: భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. కానీ ఇప్పుడు అదే ప్రశ్నార్థకమవుతోంది. దేశంలో మతవిద్వేషం పేట్రేగిపోతుండటం, 'హిందూత్వ' సమాజ స్థాపన కసరత్తు పెరగడంతో హిందూ దేశం దిశగా భారత్ పయనిస్తోందంటే ఏ మాత్రం ఆరోపణ కాదు. ఇతర మతపరమైన విశ్వాసాలను నమ్మే వారంటే గిట్టని హిందువుల సంఖ్య నేడు పెరిగిపోతోంది. బహిరంగ ప్రదేశాలను దుర్వినియోగిస్తున్నారన్న నెపంతో సామూహిక ప్రార్థన (నమాజ్) ఆచరించే ముస్లింలపై హిందువులు దాడులు చేస్తున్నారు. చివరకు ముస్లింలు తమ ఇళ్లలో తరావీ (రాత్రి నమాజ్) ఆచరించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇది తాజాగా నోయిడాలో వెలుగుచూసింది. దీనిని బట్టి ఆలయాలు కట్టుకొని లౌడ్‌స్పీకర్లు పెట్టి భజనలను హిందువులు చేసుకోవచ్చు కానీ ముస్లింలు తమ ఇంట్లో కుటుంబం, బంధుమిత్రులతో కలిసి నమాజ్ ఆచరిస్తే సహించలేరనే కదా అర్థం. క్రిస్మస్ సందర్భంగా కొన్ని హిందూ సంస్థలు చర్చీల్లోకి చొరబడి రభస సృష్టించిన ఘటనలు అనేకం చోటుచేసుకోవడం విదితమే. ఇతర మతస్తులపై తమ విద్వేషాన్ని వెళ్లగక్కేందుకు హిందువులు సాకులు వెతికే పరిస్థితి దాపురించిందంటే హిందువుల నైజం ఎంతలా మారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఇది చాలా తీవ్రమైన స్థాయికి చేరుకున్నది. ముస్లిం మహిళల ఆన్‌లైన్ వేలం, ఇంటర్నెట్‌లో అసభ్య పోస్టులు పెట్టడం, ముస్లింలను అనుచిత పదజాలంతో దూషించడం నిత్యకృత్యమైంది. ఈద్ లేక ఇతర పవిత్ర దినాల్లో ముస్లింలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడాన్ని కొందరు హిందువులు పనిగా పెట్టుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదంతా వర్చువల్ ప్రపంచంలో జరుగుతోందని చెప్పడం ఈ పరిస్థితి తీవ్రతను తక్కువ చేయడమే అవుతుంది. హిందువుల్లో అనర్గళంగా మాట్లేడే కొందరు 'నైపుణులు' పెరిగారు. వారు నోరు విప్పితే హింసను ప్రబోదిస్తారు. వీరిలో మహిళలూ ఉన్నారు. వారిని అనుసరించే వారు కూడా విద్వేషాన్ని ఆస్వాదిస్తున్నారు. తమ మనస్సులో నాటుకున్న విషబీజాలను వీరు విదేశాలకు తీసుకెళుతున్నారు.

తెలంగాణ ప్రతిష్ఠ వెలుగులీనేలా సచివాలయం

సీఎం కేసీఆర్

విశాలాంధ్ర- హైదరాబాద్: తెలంగాణ ప్రతిష్ఠ వెలుగులీనేలా సచివాలయం నిర్మించామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు పేర్కొన్నారు. వినూత్న రీతిలో అత్యద్భుతంగా సచివాలయం నిర్మించామన్నారు. నూతన సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

దేశంలోనే మొట్టమొదటి పర్యావరణ అనుకూల మహాద్భుత కట్టడంగా ఆయన పేర్కొన్నారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సచివాలయం నిర్మించామని తెలిపారు. రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం ఇదే తొలిసారి. తాత్వికత సైద్ధాంతిక అవగాహనతోనే అంబేద్కర్ పేరు పెట్టామని కేసీఆర్ తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడంతో పాటు 125 అడుగులు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించినందుకు ది ప్రాక్టీసింగ్ బుద్దిస్ట్ సొసైటీ (బౌద్ధ ఉపాసక్ మహాసభ) వారు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభినందనలు తెలిపారు. ఈ మేరకు లక్నో నుంచి సొసైటీ ప్రధాన కార్యదర్శి కేఆర్ రావత్ సీఎం కేసీఆర్‌కు ఒక లేఖను పంపించారు. ఆ లేఖ ఇలావుంది. తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి డా. బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడం, హుస్సేన్ సాగర్ తీరాన ఏప్రిల్ 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో గొప్ప విషయం. ఈ దిశగా మీరు వేసిన అడుగు అంబేద్కర్ భావజాలాన్ని విశ్వసించే వారికి శుభవార్తగా సంతోషాన్ని కలిగిస్తున్నది. ఇంత గొప్ప కార్యాన్ని చేపట్టిన మీకు, బౌద్ధ ఉపాసక్ మహాసభ శత కోటి అభినందనలు తెలియజేస్తున్నది. అనునిత్యం ఇటువంటి విశిష్టమైన కార్యక్రమాలు చేపట్టేలా, తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం మరింతగా కృషి కొనసాగించేలా, మీకు సదా ఆయురారోగ్యాలను సుఖసంతోషాలను శక్తిని ప్రసాదించాలని, ఆ బుద్ధ భగవానున్ని ప్రార్థిస్తున్నాము అని ఆ లేఖలో రావత్ పేర్కొన్నారు.

జియో ఎయిర్ టెల్ ధరల యుద్ధం

రూ.199తో న్యూ బ్రాడ్‌బాండ్ ప్లాన్

న్యూఢిల్లీ: టెలికం రంగంలో ప్రధాన సంస్థలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ మధ్య పోటీ మరింత తీవ్రం అయ్యింది. భారతీ ఎయిర్‌టెల్ తాజాగా చౌక ధరలోనే రెండు కొత్త బ్రాడ్ బాండ్ ప్లాన్లు అందుబాటులోకి తెచ్చింది. బ్రాడ్‌బాండ్ స్టాండ్‌బై ప్లాన్లు అనే పేరుతో వీటిని ప్రకటించింది. వాటిల్లో ఒక ప్లాన్ టారిఫ్ రూ.199 కాగా, మరో ప్లాన్ టారిఫ్ రూ.399గా ఎయిర్‌టెల్ ఖరారు చేసింది. గత నెలలో బ్యాకప్ ప్లాన్ పేరుతో రిలయన్స్ జియో రూ.198కే జియో బ్రాడ్ బాండ్ ప్లాన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో జియోకు పోటీగానే ఎయిర్‌టెల్ ఈ టారిఫ్ ప్లాన్లు తెచ్చినట్లు కనిపిస్తున్నది. ఎయిర్‌టెల్ ప్రకటించిన కొత్త బ్రాడ్‌బాండ్ ప్లాన్లతో 10 ఎంబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్ సేవలు అందుకోవచ్చు. అయితే రూ.199 టారిఫ్ ఎంచుకున్న యూజర్లు ఒకేసారి ఐదు నెలల చార్జీ పే చేయాలి. ఇన్‌స్టలేషన్ చార్జీ రూ.500తోపాటు మొత్తం రూ.1674 పే చేయాలి. ఈ ప్లాన్‌లో ఎయిర్‌టెల్ వై-ఫై రౌటర్ ఉచితంగా అందిస్తుంది. ఇక మరో రూ.399 టారిఫ్ ఎంచుకున్న వారికి కూడా 10 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్ సేవలు పొందొచ్చు. ఈ టారిఫ్ ఎంచుకున్న ఖాతాదారులకు కూడా ఎయిర్ టెల్ ఉచితంగా రౌటర్ అందిస్తుంది. ఈ టారిఫ్ కింద అదనంగా ఎక్స్ ట్రీమ్ బాక్స్, 350 చానెల్స్ ఉచితంగా లభిస్తాయి. రూ.500 ఇన్‌స్టలేషన్ చార్జీతోపాటు మొత్తం ఐదు నెలల టారిఫ్ కలుపుకుని రూ.3000 ఒకేసారి చెల్లించాలి. ఈ రెండు ప్లాన్లతోపాటు ఎయిర్‌టెల్ రూ.499, రూ.799, రూ.999, రూ.3999 టారిఫ్‌లతో వేర్వేరు బ్రాడ్ బాండ్ ప్లాన్లు అందిస్తున్నది. గత నెలలో రిలయన్స్ జియో తన బ్రాడ్ బాండ్ యూజర్ల కోసం రూ.198లకే బ్యాకప్ ప్లాన్ అమల్లోకి తెచ్చింది. ఈ ప్లాన్ ఎంచుకున్న యూజర్లు కూడా 10 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్ సేవలు అందుకోవచ్చు. ఈ ప్లాన్ ఎంచుకున్న కస్టమర్లు అదనంగా రూ.21-152 పే చేసి ఒక రోజు నుంచి ఏడు రోజుల వరకు తమ ఇంటర్నెట్ స్పీడ్ 30 ఎంబీపీఎస్ నుంచి 100 ఎంబీపీఎస్ వరకు పెంచుకునే వెసులుబాటు కల్పించింది. అయితే, ఐదు నెలల టారిఫ్ ఒకేసారి పే చేయాలి. ఈ ప్లాన్ అప్‌గ్రేడ్ చేసుకున్న వారు టీవీ, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్ కూడా పొందవచ్చు.

మాజీ మావోయిస్టులు అరెస్ట్

జయశంకర్ భూపాలపల్లి : ప్రజాప్రతినిధులను, కాంట్రాక్టర్లను బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసిన మాజీ మావోయిస్టులను తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సురేందర్ రెడ్డి వివరాలను వెల్లడించారు. కాళేశ్వరం సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డిని రూ. 50 లక్షల డిమాండ్ చేస్తూ మాజీ మావోయిస్టులు బెదిరించారని ఆయన అన్నారు. పోలీసులు కాళేశ్వరం చెక్ పోస్టు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కారులో అనుమానంగా ఉన్న ఐదుగురిని గుర్తించి అదుపులో తీసుకున్నామని ఆయన వెల్లడించారు. మాజీ మావోయిస్టుల నుంచి కారు, ఒక పల్సర్ బైక్, రెండు డమ్మీ పిస్టోళ్లు, నాలుగు జిలిటెన్ స్టిక్స్, ఐదు మొబైల్ ఫోన్లు, బ్యాగును స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

కర్నాటకలో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం

అత్యంత అధ్వాన స్థితిలో కమలం పార్టీ
ఓపీనియన్ పోల్స్‌లో వెల్లడి

న్యూఢిల్లీ : మే 10న జరిగే కర్నాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ స్పష్టమైన మెజారిటీ దిశగా దూసుకువెళుతుందని, బీజేపీ అత్యంత అధ్వానమైన పనితీరును కనబరుస్తుందని ఎన్నికల ముందు నిర్వహించిన సర్వే తెలిపింది. కన్నడ సంస్థ ఎదినా ఈ సర్వేను నిర్వహించింది. 113 సీట్లకుపైగానే కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం వుందని ఆ సర్వే తెలిపింది. 43శాతం ఓట్లతో కాంగ్రెస్ 132-140 సీట్లను గెలుచుకుంటుందని సర్వేలో అభిప్రాయం వ్యక్తమైంది. అదే గనుక నిజమైతే గత మూడు దశాబ్దాల్లో కాంగ్రెస్ అత్యుత్తమ ప్రదర్శన ఇదే అవుతుందని భావిస్తున్నారు. 33శాతం ఓట్లతో బీజేపీ 57 నుంచి 65 సీట్లు గెలుచుకుంటుందని భావిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 104సీట్లు గెలుచుకుంది. ఇక్కడ రెండు ముఖ్య విషయాలను గుర్తించాల్సి వుంది. మొదటిది, బీజేపీ ఎన్నడూ కూడా రాష్ట్రంలో సొంతంగా మెజారిటీ సంపాదించుకోలేదు. కాంగ్రెస్ ఎప్పుడూ మెరుగైన ఓటు వాటాను గెలుచుకుంటోంది. రెండోది, 2019లో ఎన్నికలు జరిగిన 14మాసాల తర్వాత కాంగ్రెస్-జనతాదళ్ (సెక్యులర్) ప్రభుత్వాన్ని కూలదోసి, ఆ పార్టీల ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, ఉప ఎన్నికల్లో గెలిపించి, వివాదాస్పద పరిస్థితుల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. 2013లో బీజేపీ చీలిపోయినప్పుడు మినహా గత రెండు దశాబ్దాల్లో అత్యంత అధ్వానమైన పనితీరును కనబరిచింది. జెడీ(ఎస్)కు కూడా అదే పరిస్థితి ఎదురు కావచ్చునని సర్వే పేర్కొంది.

ఈ ఒపీనియన్ పోల్స్ నిజమైనట్లైతే, అవినీతి, అసమర్థత అనేవి బీజేపీని పారద్రోలడానికి ప్రధాన కారణాలుగా వున్నాయనేది స్పష్టమైందని ఎదినా సర్వే కోఆర్డినేటర్ డాక్టర్ వాసు హెచ్‌వి ది వైర్‌తో వ్యాఖ్యానించారు. అదే సమయంలో మరోకోణం కూడా వుంది. కర్నాటకలో అణచివేతకు గురైన వర్గాలు అంటే దళితులు, బీసీలు కొంత కాలం నుంచి కాంగ్రెస్‌కు మరింత అనుకూలంగా వున్నారు.

పేదలు మరింతమంది కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేస్తున్నారు. ధరల పెరుగుదల, ఇతర సమస్యలు, గత మూడు నాలుగేళ్లలో ఆర్థిక క్షీణత, కోవిడ్ అనంతర పరిణామాలు, ఈ కారణాలన్నీ ఈ ఓపీనియన్ పోల్‌లో వ్యక్తమవుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలు కూడా ఇందుకు దోహదపడుతున్నాయన్నారు.

రాహుల్ కేసు 2న విచారణ

(మొదటిపేజీ తరువాయి)

లేవని లేవని, ఆయన హత్యలాంటి నేరానికి పాల్పడలేదని, ఎలాంటి నైతిక ప్రమాణాలను అతిక్రమించ లేదని అన్నారు. సమాజానికి హాని లేనందున ఈ కేసులో బెయిల్ ఇవ్వొచ్చని వాదించారు. రాహుల్ అసలు మోదీని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. వాయ్‌నాడ్ ఉప ఎన్నిక జరిగితే ఆ ఫలితాలు మార్చలేం. అందుకోసమే రాహుల్‌కు శిక్ష నుంచి తప్పించండి. ఇందుకోసం దీనికంటే పెద్ద కారణం ఇంకేం కావాలి. ఆయనపై తీవ్రమైన ఆరోపణలు లేవు కానీ కోర్టు తగు చర్యలు తీసుకోకుంటే ఆయన తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొవాల్సి వస్తుంది' అని సింఘీ వాదించారు. రాహుల్ వ్యాఖ్యలు చేసిన ప్రాంతంలో కాకుండా వేరొక చోట బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేష్ మోదీ పిటిషన్ వేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. గాంధీపై అనర్హత వేటు మీద మోదీకి అంత ఆసక్తి ఎందుకని ప్రశ్నించారు. అనర్హతకు గురికాకముందు కేరళ, వాయనాడ్ నియోజకవర్గానికి రాహుల్ ప్రాతినిధ్యం వహించారు. ఇప్పుడు కేసు గెలిచినాగానీ ఆ స్థానానికి జరిగే ఉప ఎన్నిక ఫలితాన్ని మార్చలేరు. ఆయనకు పడిన శిక్షను రద్దు చేసేందుకు ఈ ప్రత్యేక పరిస్థితి సరిపోదా? ఇంతకంటే బలమైన కారణం ఏముంటుంది? ఈ కేసు విచారణలో ఆరు తీవ్రమైన తప్పిదాలు ఉన్నాయి. రఫేల్ వ్యాఖ్యల క్రమంలో ఆలోచించి మాట్లాడాలని రాహుల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించడాన్ని ట్రయిల్ కోర్టు ప్రస్తావించింది. కానీ రఫేల్ వ్యవహారం 2019, నవంబరు 14లో జరిగింది. అందుకు ఏడు నెలల ముందు అంటే ఏప్రిల్ 13న చేసిన వ్యాఖ్యలాధారితంగా ప్రస్తుతం కేసు నడుస్తోంది. ఇవేమీ తీవ్రమైన ఆరోపణలు కాదు. ఆయనకు శిక్ష తప్పించండి' అని సింఘ్వీ నొక్కిచెప్పారు. వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను మే 2న చేపడతామని పేర్కొంది.

కేసు పూర్వాపరాలు...

రాహుల్ 2019లో ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మోదీ ఇంటిపేరు'పై వ్యాఖ్యలు చేశారు. 'నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ' దొంగల పేర్లన్నీ మోదీ ఇంటి పేరే ఎందుకు ఉంటున్నాయి?' అని ప్రశ్నించారు. దీనిపై సూరత్ హైకోర్టులో పరువునష్టం కేసు నమోదుకాగా, మార్చి 23న ఈ కేసులో రాహుల్‌ను సూరత్ మెజిస్ట్రేట్ కోర్టు దోషిగా నిర్ధారిస్తూ, రెండేళ్ల జైలుశిక్ష విధించింది. ఈ తీర్పుపై పైకోర్టుకు వెళ్లేందుకు 30రోజులు గడువు ఇచ్చింది. బెయిల్ సైతం మంజూరు చేసింది. దిగువకోర్టు తీర్పును సెషన్స్ కోర్టులో రాహుల్ సవాలు చేయగా, ఏప్రిల్ 20న ఆ పిటిషన్‌ను సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. సూరత్ కోర్టు తీర్పుపై స్టే కోరుతూ రాహుల్ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు.

'హెచ్1బీ' లాటరీ విధానంలో మోసాలు

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తులు వచ్చాయి. 2023కి ఈ సంఖ్య 4,83,927గా ఉండగా 2022లో 3,01,447, 2021లో 2,74,237 మంది దరఖాస్తు చేసుకున్నారు. సాధారణంగా రెండు సందర్భాల్లో ఈ సంఖ్య అమాంతం పెరుగుతంది. ఒకే లబ్ధిదారు ఎక్కువసార్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పుడు లేదా ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకున్నప్పుడు ఈ సంఖ్య పెరుగుతుంది. ఈ ఏడాది 4,08,891 మంది ఒకటి కంటే ఎక్కువ సార్లు లాటరీలో నమోదు చేసుకున్నారు. గతేడాది ఈ సంఖ్య 1,65,180గా ఉంది. ఈ మోసాల నేపథ్యంలో తమ నమోదు ప్రక్రియను ఆధునీకరించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు యూఎస్‌సీఐఎస్ తెలిపింది.

పోరాటాలతోనే హక్కుల సాధన

(మొదటిపేజీ తరువాయి)

నిరసన తెలియజేసినప్పటికీ ఈ ప్రభుత్వం దిగి రావడం లేదని మన హక్కుల సాధన కోసం ఎంతటి ఉద్యమానికైనా మనందరం సిద్ధంగా ఉండాలని, రానున్న రోజుల్లో ఈ రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి లింగం ఫిలిప్, మోదు మూడి నాగరాజు, బొప్పరాజు, జి జ్యోతి, ఐవీ రావు, సతీశ్, పేపేటి సత్యనారాయణ, ఎ న్జీ వో నాయకులు శ్యామ్ ,తోట సతీష్, జగదీశ్ ఉద్యోగులు, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

విశాలాంధ్ర-రాప్తాడు: అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో మే 26 నుండి 28వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే అనంతపురం జిల్లా బాలబాలికల జట్లను శనివారం ఎంపిక చేశారు. అనంత పురం ఆర్డీటీ స్టేడియంలో జట్ల ఎంపిక పోటీలు నిర్వహించగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారని ఏపీ సాఫ్ట్ బాల్ సంఘం సీఈఓ సి.వెంకటేశులు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆర్డీటీ క్షేత్రస్థాయి సమన్వయకర్త ఓబులేసు హాజరై ఎంపికలను పర్యవేక్షించారు. సాఫ్ట్ బాల్ క్రీడ దేశంలోనే అత్యున్నత స్థానంలో ఉందని, అందులో ఆంధ్రప్రదేశ్, అనంతపురం జట్లు ప్రథమ, ద్వితీయ స్థానంలో రాణిస్తుండటం హర్షణీయమని వెంకటేశులు అన్నారు. ఇందుకోసం కృషి చేస్తున్న ఏపీ సాఫ్ట్‌బాల్ సంఘం, ఆర్డీటీ సంస్థల సహకారం అత్యున్నతమైనదన్నారు. ఈ క్రీడ ద్వారా ఎంతోమంది క్రీడా కారులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానాల్లో ఉన్నారని, గత పదేళ్లలో ఈ క్రీడ ఉన్నత స్థానంలో నిలవడానికి ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూ ఫెర్రర్ సహకారం మరువలేనిదన్నారు. రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలకు ఎంపికైన అనంతపురం జిల్లా బాలబాలికల జట్లు విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. అనంతపురం జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం సభ్యులు ఎస్ కేశమూర్తి, పీడీలు కె.గోపాల్‌రెడ్డి, పక్కీరప్ప, ప్రభాకర్, లతాదేవి, హిమబిందు, రామాంజనమ్మ, గంగ, కోచ్‌లు బద్రి, సాయిదీక్షిత్, శివాజీ, లోకేశ్, లక్ష్మి పాల్గొన్నారు.

బాలుర జట్టు: శశి, బుడగల అక్షయ్ సాగర్, అరవింద్, అరవింద్‌రెడ్డి, జగదీశ్, సాయి, రంజిత్, ముబారక్, నరసింహ, గణేశ్, అంజి, సునీల్, సాయి కుమార్, బస్వంత్, మనోహర్, భాను, శంకర్, సాయికుమార్, మోక్షిత్ వర్మ, సాదిక్. **బాలికల జట్టు:** రాజేశ్వరి, అనూష, శిరీష, అమిదాబి, గౌరీప్రియ, ఉషారాణి, కీర్తన, మౌనిక, కల్పన, లోహిర, అనూష, హేమలత, ఫాతిమా, షబీనా, మౌనిక.

ధాన్యం కొనుగోలు కోసం రైతుల ఆందోళన

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం రూరల్: కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లిగూడెం, నందమూరులో నిరసన చేపట్టారు. తమ గోడును పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామంటారు కానీ ఇలా రోడ్డుపై నిలబెట్టారని ప్రభుత్వంపై మండిపడ్డారు. వెంటనే కల్లాలోని ధాన్యం కొనుగోలు చేయాలని, మిల్లర్లు, రవాణా ఖర్చులను భరించాలని, ఆన్‌లైన్‌కు బదులు ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులకు తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి మద్దతిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు శనగన రాంబాబు. అరసాల, ప్రసాద్ గారుసుపూడి సర్వేశ్వరరావు, దానయ్య, అరుగొలను బాలయ్య నిడదవోలు త్రినాధరావు, ఆరుగొలను పండు పాల్గొన్నారు.

మూగజీవాలకు సేవ అదృష్టం

- మనుషుల ఆరోగ్యానికే కాదు... పశు ఆరోగ్యానికీ భద్రత
- గుడ్ల ఉత్పత్తిలో మొదటి, పాల ఉత్పత్తిలో 5వ స్థానం
- మంత్రి సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నోరులేని మూగజీవాలకు సేవ చేయడాన్ని అదృష్టంగా భావించాలని రాష్ట్ర పశు సంవర్థక, డెయిరీ, మత్స్య శాఖ మంత్రి డా.సీదిరి అప్పలరాజు అన్నారు. జీవాల సేవలో తరిస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ పశువైద్య దినోత్సవం-2023 సందర్భంగా రాష్ట్రంలోని గొర్రెలు, మేకల పెంపకందారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి లైవ్ స్టాక్ మిషన్ ద్వారా శాస్త్రీయ పద్ధతిలో గొర్రెలు, మేకల యాజమాన్యంపై శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి అవగాహన కార్యక్రమం జరిగింది. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో పశు సంవర్థక శాఖ సాధించిన పురోగతిని, సాధించాల్సిన ప్రగతిని, లక్ష్యాలను క్లుప్తంగా వివరించారు. మనుషుల ఆరోగ్యానికే కాకుండా పశువుల ఆరోగ్యానికి సైతం భద్రత, భరోసా కల్పిస్తూ... పాడిరైతులకు, పశువుల పెంపకందార్లకు మేలుచేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక కార్యక్రమాలు ప్రవేశపెట్టారని మంత్రి కొనియాడారు. తొలిసారి ఏపీలో ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. దేశప్రగతిని ఆ దేశంలో ఉన్న పశువుల ఆరోగ్యస్థితిని బట్టి చెప్పవచ్చన్న మహాత్మా గాంధీ స్ఫూర్తితో పనిచేస్తున్నామన్నారు. డా.వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ ద్వారా పశువులకు అంబులెన్స్ సేవలు తీసుకొచ్చామన్నారు. మూగ జీవాలు తీవ్ర అనారోగ్యానికి గురైనప్పుడు 1962 నంబర్‌కు కాల్ చేస్తే సత్వరమే పశువుల అంబులెన్స్‌లు వచ్చి...వైద్య సేవలందించడం గొప్ప సంస్కరణ అన్నారు. పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకలు వంటి జంతువులకు అత్యవసరమైన, నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నా మన్నారు. మందులతో పాటు పశువులను అంబులెన్స్ వాహనంలో ఎక్కించేందుకు వీలుగా హైడ్రాలిక్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ అమూల్ పాలవెల్లువ ద్వారా రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా ఆటోమేటెడ్ పాలసేకరణ కేంద్రాలు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, వైఎస్సార్ చేయూత పథకం ద్వారా అక్కచెల్లెమ్మలకు పాడి ఆవులు, గేదెల యూనిట్ల ఏర్పాటు, అక్కచెల్లెమ్మలకు మెరుగైన జీవనోపాధి కల్పనలో భాగంగా సుస్థిర ఆదాయం చేకూర్చడమే లక్ష్యంగా జగనన్న జీవక్రాంతి పథకం ద్వారా గొర్రెలు, మేకల యూనిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పశు ఆరోగ్య సంరక్షణ కార్డులను జారీ చేసిన రాష్ట్రం తమదేనన్నారు. పశు సంవర్థక శాఖ ద్వారా అమలు చేస్తున్న వినూత్న పథకాల ద్వారా జీఎస్డీపీ పెరిగిందన్నారు. పశు సంవర్థక సహాయకులు, పారా స్టాఫ్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌ల ద్వారా పశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, 154 వెటర్నరీ ల్యాబ్‌లను త్వరితగతిన వినియోగంలోకి తేనున్నామన్నారు. పశు సంవర్థక శాఖ ప్రధాన కార్యదర్శి డా.గోపాలకృష్ణ ద్వివేది, సంచాలకులు డా. ఆర్. అమరేంద్రకుమార్, అడిషనల్ డైరెక్టర్ కె.వెంకట్రావు, స్టైల్ డైరెక్టర్ డా. వై.సింహాచలం, ఎస్ఎస్‌కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు, రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ఎస్ఎస్ కృష్ణమూర్తి, సీకే రావు, దేవాదాయ ధర్మాదాయ ట్రస్ట్ సభ్యులు, రిటైర్డ్ సీఈవో డా. రామలింగరాజు, పశు సంవర్థక శాఖ రిటైర్డ్ డైరెక్టర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డా.సీకే రావు, ఎండోమెంట్ ట్రస్ట్ 22వ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన నిష్ణాతులైన 16 మంది పశువైద్యులను, ఔత్సాహికవేత్తలు, విద్యార్థులను మంత్రి శాలువాతో సత్కరించి జ్ఞాపికతో పాటు మెడల్‌ను బహూకరించారు.

పంటనష్ట పరిహారంలో వ్యవసాయ కూలీలకు
పది శాతం కేటాయింపు భేష్

- పంజాబ్ నిర్ణయంపై జల్లి విల్సన్, ఆవుల శేఖర్ హర్షం
- ఏపీలో అమలుకు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పంట నష్టానికిచ్చే పరిహారంలో పది శాతాన్ని వ్యవసాయ కూలీలకు కేటాయిస్తామని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటించడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం స్వాగతించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జల్లివిల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వర్షాలు, తుపాన్లు వచ్చి పంటలకు భారీగా నష్టం జరిగిన నేపథ్యంలో వ్యవసాయ కూలీలు పనులు కోల్పోయి ఆర్థికంగా నష్టపోతారు. ఈ విషయాన్ని గుర్తించిన పంజాబ్ ప్రభుత్వం పంట నష్టంలో పది శాతం వారికి ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా వ్యవసాయ కూలీలకు పంట నష్టంలో పది శాతం వ్యవసాయ కూలీలకు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరిహారం కచ్చితంగా కూలీలకు అందేలా చూడాలని కోరారు. పనుల్లేక వ్యవసాయ కూలీలకు వలసలే శరణ్యమని, వాటిని ఆపాలంటే పంజాబ్ ప్రభుత్వం తరహా నిర్ణయం తీసుకోవడం మంచిదని సూచించారు. ఈ విషయంలో పంజాబ్ రాష్ట్రాన్ని కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వ్యవసాయ కూలీలు లబ్ధి పొందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఐక్యపోరాటం చేస్తామని తెలిపారు.

మేడే, విశాఖ ఉక్కుపైన 3న ఆందోళనలో పాల్గొనే
ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు

విశాలాంధ్ర-విజయవాడ: మే ఒకటవ తేది ప్రపంచకార్మికుల దినోత్సవం మేడే, 3వ తేదీన విశాఖ ఉక్కు ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కార్యక్రమాలలో పాల్గొనే ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుల వివరాలిలావున్నాయి.

నాయకులు	మేడే	3న విశాఖ ఉక్కుపై రాస్తారోకో
జి.ఓబులేసు	అనంతపురం	విజయవాడ
రవీంద్రనాథ్	తాడేపల్లిగూడెం	గుంటూరు
ఎస్.వెంకట సుబ్బయ్య	నెల్లూరు	బాపట్ల
బీవీవీ కొండలరావు	రాజమండ్రి	అమలాపురం
సీహెచ్‌వీ రామారావు	నూజివీడు	ఏలూరు
సోమసుందర్	తాడేపల్లిగూడెం	భీమవరం
రాధాకృష్ణమూర్తి	విజయవాడ	పల్నాడు
గిరి	చిత్తూరు	తిరుపతి
లలితమ్మ	కర్నూలు	నంద్యాల
మునెప్ప	కర్నూలు	కర్నూలు
జె.రాజారెడ్డి	అనంతపురం	పుటపర్తి
ఎల్.నాగసుబ్బారెడ్డి	కడప	అన్నమయ్య
పి.సుబ్బరాయుడు	పొద్దుటూరు	నెల్లూరు
పదాల రమణ	విశాఖ	శ్రీకాకుళం
బుగతా అశోక్	విజయనగరం	విజయనగరం
స్రవంతి	శ్రీకాకుళం	విజయనగరం
రమేశ్	నంద్యాల	అనంతపురం
శివయ్య	యర్రగుంట్ల	పొద్దుటూరు

హక్కుల సాధనకు పోరాడాల్సిందే

- రైతులకు కేవీవీ ప్రసాద్ పిలుపు
- గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు డిమాండ్

విశాలాంధ్ర-గన్నవరం: గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం గన్నవరంలోని సీపీఐ కార్యాలయంలో ఆ నియోజకవర్గ రైతు సంఘం మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభకు సీనియర్ కామ్రేడ్ పెద్దు వెంకటరత్నం అధ్యక్షత వహించారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ రైతే రాజు అన్నది నాటి మాట... హక్కుల కోసం రైతన్నకు పోరాటం తప్పదన్నది నేటి మాటని నొక్కిచెప్పారు. రోజురోజుకు అన్నదాతలకు కొత్త సమస్యలు వస్తున్నాయని అన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు దేశ రైతుల గురించి ఆలోచించడం లేదని, రైతు వ్యతిరేక చట్టాలను పాలకులు తెస్తుంటే వారికి న్యాయం జరిగేది ఎలా అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. వివాదాస్పద సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదికిపైగా జరిగిన రైతాంగ పోరాటాన్ని ప్రస్తావించారు. అదే స్ఫూర్తితో పోరాటాలు చేసి పాలకుల మెడలు వంచి తమ హక్కులను రైతులు సాధించుకోవాలని ప్రసాద్ పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురం నుంచి తడ వరకు రైతు సంఘాల బస్సు యాత్ర నిర్వహించాలని ఆయనన్నారు. రైతు సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షుడు వెలగపూడి అజాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 52 పంటలలో 14కు గిట్టుబాటు ధర ప్రకటించినా, అది సక్రమంగా అందడం లేదన్నారు. గిట్టుబాటు ధర లభించక అప్పుల్లో కూరుకుపోతూ ఆత్మహత్యకు రైతులు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 65 కమిషన్లు వేసినా రైతుకు న్యాయం జరగలేదన్నారు. 55 సంవత్సరాలు పైబడిన రైతుకు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ భూములను కార్పొరేట్‌లకు అప్పగిం చాలని ప్రభుత్వాలు చట్టాలు తెస్తున్నాయని, దీంతో రైతులు నష్టపోతారన్నారు. ఈ చర్యలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కొత్త విధానాలు రూపొందించాలని వ్యవసాయం-రైతు పరిరక్షణ చట్టాలు తేవాలన్నారు. గన్నవరం ప్రాంతంలో తెంపల్లి బల్లిపర్రు... పోలవరం కాలవపై లాకులు నిర్మించి అక్కడి రైతులకు నీరందించాలని డిమాండ్ చేశారు పండించిన పంటకు బీమా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నేతలు ముక్కామల ఉమామహేశ్వరరావు, సీపీఐ గన్నవరం కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి పిచ్చయ్య, రిటర్డ్ ఇంజినీర్ కంభంపాటి పాపారావు పాల్గొన్నారు.



మెట్ట పొలాలకు తక్షణమే సాగునీరు
ఆవుల శేఖర్ డిమాండ్

విశాలాంధ్ర-జూపాడుబంగ్లా: నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం మండ్లెం, తంగడంచ, భాస్కరపురం గ్రామాల పరిధిలో ఉన్న 3వేల ఎకరాల మెట్ట భూములకు తక్షణమే కృష్ణాజలాలు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. నాగటూరు లిఫ్ట్‌కు డీసీలు పెంచి సాగునీరు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, రైతాంగానికి న్యాయం జరిగేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని, కృష్ణా జలాలు నందికొట్కూరు నియోజకవర్గ రైతుల హక్కని, గ్రామ రైతుల ఉద్యమానికి అండగా ఉంటామని స్పష్టంచేశారు. మండ్లెం గ్రామ రైతు సురేశ్ అధ్వర్యంలో చేస్తున్న జలదీక్షకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆవుల శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఈ ప్రాంత రైతులు త్యాగాలు చేశారని, అలాంటి వారి నోట్లో మట్టి కొట్టడం సరికాదన్నారు. ఈ ప్రాంతం నుండి ఎన్నికైన ప్రజాప్రతినిధులు సాగునీటి విషయంలో నోరు మెదపడం లేదని, కనీసం ఎత్తిపోతల పథకాలు తీసుకురావడంలోనూ విఫలమయ్యారన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రచార ఆర్భాటాలు తప్ప చేసిందేమీ లేదన్నారు. తక్షణమే మండ్లెం గ్రామ రైతాంగానికి సాగునీరు అందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, చలో కలెక్టరేట్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా నాయకులు రమేశ్‌బాబు, సురేశ్, రైతులు అరుణ్, ప్రసాద్, నరసన్న, రవీంద్ర, దాసు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరనున్న ఉత్తరాంధ్ర కల

- భోగాపురం విమానాశ్రయం, వైజాగ్ టెక్‌పార్క్‌కు 3న సీఎం జగన్ శంకుస్థాపన
- వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఉత్తరాంధ్ర జిల్లాలకు తలమానికంగా నిలవనున్న వివిధ ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెల మూడో తేదీన శంకుస్థాపన చేయనున్నారని వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. సుమారు 3,500 కోట్ల రూపాయలతో విశాఖ ఐటీ సెజ్‌లోని హిల్ నెంబర్ 4పై నిర్మించనున్న వైజాగ్ టెక్‌పార్క్ (అదానీ డేటా సెంటర్)కు సీఎం జగన్ శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించి హిల్ నెంబర్ 3 మీద నిర్మిస్తున్న హెలిప్యాడ్‌ను, హిల్ నెంబర్ 4 మీద నిర్మించనున్న డేటా సెంటర్‌కు సంబంధించిన ఏర్పాట్లను వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్, కలెక్టర్ మల్లికార్జున, నగర్ పోలీస్ కమిషనర్ తదితరులు శనివారం ఉదయం పరిశీలించారు.

అనంతరం సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భోగాపురం విమానాశ్రయం నిర్మిస్తామని చెప్పిందని, మాట ప్రకారం వచ్చే నెల మూడో తేదీన సీఎం జగన్ దీనికి శంకుస్థాపన చేయడమే కాకుండా వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. 134 ఎకరాలలో నిర్మిస్తున్న వైజాగ్ టెక్ పార్క్‌ను మూడు దశలలో...ఏడేళ్లలో పూర్తిచేస్తామని సుబ్బారెడ్డి వివరించారు. ఈ టెక్‌పార్క్ ద్వారా సుమారు 39 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నందున ప్రజలు తమను విశ్వసిస్తున్నారని సుబ్బారెడ్డి అన్నారు.

టీడీపీ రాజకీయ ఫలకాలు: మంత్రి అమర్నాథ్

మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాజకీయం కోసమే శిలాఫలకాలు వేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏ ఒక్క భారీ ప్రాజెక్టునైనా ప్రారంభించి పూర్తి చేసిందా అని ఆయన ప్రశ్నించారు. అందుకే గత ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని నమ్మలేదని, వచ్చే ఎన్నికల్లోనూ టీడీపీకి ఓటమి తప్పదని అమర్నాథ్ అన్నారు. భోగాపురం విమానాశ్రయానికి రెండోసారి శంకుస్థాపన చేస్తున్నట్లు జరుగుతున్న దుష్ప్రచారంపై మంత్రి అమర్నాథ్ స్పందిస్తూ 2019 మార్చి 10వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలిసి ఫిబ్రవరి 15వ తేదీన శంకుస్థాపన చేసిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. 2,200 ఎకరాలలో 35 వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న విమానాశ్రయానికి అన్ని రకాల అనుమతులు లభించాయని, నిర్మాణ సంస్థకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని అమర్నాథ్ వివరించారు. వైజాగ్ టెక్‌పార్క్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సుమారు 40వేల మందికి ప్రత్యక్షంగా, 50 వేల మందికి పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. టెక్‌పార్కు అందుబాటులోకి వస్తే విశాఖ ఆర్థికంగా ఎదుగుతుందన్నారు. సీఎం జగన్ జులై నుంచి విశాఖలోనే ఉంటారని మంత్రి అమర్నాథ్ పునరుద్ఘాటించారు.

బ్రిజ్‌భూషణ్‌కు సర్కార్ అండ

- ప్రియాంక గాంధీ ఆరోపణ
- నిందితుడు ఎంతటివాడైనా శిక్షించాలి: కేజ్రీవాల్
- రెజ్లర్లకు పెరుగుతున్న రాజకీయ మద్దతు

న్యూఢిల్లీ: భారత రెజ్లర్ల ఆందోళనకు రాజకీయ మద్దతు పెరుగుతోంది. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా స్థలికి పార్టీలకు అతీతంగా నాయకులు చేరుకొని సంఘీభావం తెలుపుతున్నారు. శనివారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నిరసనకారులను కలిశారు. ఇప్పటికే జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్, సీపీఎం నేత బృందా కారత్, హరియాణా మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా, రైతు నాయకుడు రాకేశ్ తికైత్, ఖాప్ పంచాయత్ నేతలు తదితరులు రెజ్లర్లను కలిసి మద్దతు ప్రకటించిన విషయం విదితమే. తాజాగా ప్రియాంక గాంధీ వాద్రా, అరవింద్ కేజ్రీవాల్ వారిని కలిశారు. బ్రిజ్‌భూషణ్ తొలగించి రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసనకారులతో కలిసి అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ఎంపీ కూడా అయిన బ్రిజ్ భూషణ్‌కు కేంద్రప్రభుత్వ అండదండలు ఉన్నాయని, ఆయనను కాపాడేందుకు సర్కార్ యత్నిస్తోందని ప్రియాంక వ్యాఖ్యానించారు. రెజ్లర్లను ఒత్తిడికి గురిచేయడం, వేధించడం, వారి కెరీర్‌ను నాశనం చేస్తుండటం ఎలా సమర్థనీయమని ప్రశ్నించారు. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిగా వెంటనే రాజీనామా చేయించి ఆపై పదవి నుంచి తొలగించాలని, అన్ని అధికారాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశానికి గొప్పపేరు తెచ్చిన మన కుమార్తెలకు న్యాయం జరగాలి. నిందితుడు ఎంత శక్తిమంతుడైనా ఎంత గొప్పవాడైనా సరే కఠినంగా శిక్షించాలి' అని కేజ్రీవాల్ ఉద్ఘాటించారు. దేశాన్ని ప్రేమించి ప్రతి పౌరుడు ఈ రెజ్లర్లకు అండగా నిలుస్తారని, బీజేపీ ఎంపీపై పోరాటంలో రెజ్లర్లకు కేంద్రం అండగా నిలవాలన్నారు. ఇదిలావుంటే, ప్రియాంక గాంధీ ముందుగా రెజ్లర్లను కలిశారు. సాక్షి మాలిక్, వినీశ్ ఫోగట్ తదితరులతో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ 'ఈ అమ్మాయిలు పతకాలు తెస్తే దేశానికి గర్వకారణమని ట్వీట్లు చేస్తారు. మా విషయంలో తప్పు జరిగిందంటే మాత్రం పెడచెవిన పెడతారు. వీరు వీధి పోరాటం చేస్తుంటే పట్టించుకోరు. నిజంగానే ఎఫ్ఐఆర్ నమోదైతే దాని ప్రతులను రెజ్లర్లకు ఇవ్వాలి. ఈ విషయంలో ప్రధాని నుంచి ఏమీ ఆశించలేం. ఎందుకంటే ఆయనకు చిత్తశుద్ధిలేదు. అదే ఉంటే రెజ్లర్లతో మాట్లాడివుండేవారు. పతకాలు గెలిచినప్పుడు తేనేటి విందులిచ్చారు మరిప్పుడు కూడా వారిని పిలిచి మాట్లాడవచ్చుగా' అని ప్రియాంక వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఆయనను ఎందుకు కాపాడుతోందని ప్రశ్నించారు. మన అమ్మాయిలకు ఇలా జరిగిందే దేశ ప్రతిష్ఠ ఏం కావాలి? సొంతవారికే రక్షణ కల్పించలేని స్థితిలో ఉన్నామా? అని నిలదీశారు.

పెట్టుబడులకు అపార అవకాశాలు
ఫుడ్ కాంక్లేవ్- 2023 ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: పెట్టుబడులకు తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి కేటీఆర్ అన్నారు. తొమ్మిదేళ్లలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు అనుకరిస్తున్నాయన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరుగుతున్న ఫుడ్ కాంక్లేవ్-2023 ప్రారంభోత్సవంలో మంత్రులు నిరంజన్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి కేటీఆర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ ఎదుగుతున్నదని చెప్పారు. మత్స్య సంపదలో దేశంలోనే నంబర్‌వన్‌గా ఉన్నామని తెలిపారు. పౌల్ట్రీ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా రాష్ట్రం ఉందన్నారు. హార్టీకల్చర్, డైరీ రంగాలను తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, హార్టీకల్చర్ విశ్వవిద్యాలయం, వెటర్నరీ వర్సిటీ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు ఈ రంగంలో పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పారిశ్రామిక విధానం టీఎస్ ఐపాస్ పనితీరు చాలా బాగుందని, రాష్ట్రంలో ఎవరైనా పెట్టుబడులు పెట్టాలంటే ఎవరిని కలవనక్కర్లేదని అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే 15 రోజుల్లోనే కంపెనీ ఏర్పాటుకు అనుమతులు వస్తాయని తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే అందుకు కావాల్సిన ముడిపదార్థాలను గ్రామీణ ప్రాంతాల నుంచి అందించేందుకు అధికారులు సహకారం అందిస్తారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు అద్భుతంగా పనిచేస్తున్నాయని కేటీఆర్ కితాబిచ్చారు. దళితబంధు పథకం కింద ఇస్తున్న రూ.10 లక్షలతో నలుగురు కలిసి 40 లక్షలతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. చిన్న మధ్యతరగతి పారిశ్రామికవేత్తలను ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని వెల్లడించారు. తెలంగాణలో ఉత్తర, దక్షిణ భారతదేశానికి చెందిన ప్రజలు పనిచేస్తున్నారని తెలిపారు. దేశంలో అత్యధికంగా వరి, పత్తి పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమల ఏర్పాటుకు కావలసిన ముడి పదార్థాలు రాష్ట్రంలో లభిస్తాయన్నారు. విజయ డెయిరీ లాభాల బాటలో సాగుతున్నదని కేటీఆర్ తెలిపారు. మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో దేశానికే తెలంగాణ ఆదర్శమన్నారు. సాగుకు 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఇదేనన్నారు. చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయం, డెయిరీ రంగం అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. విజయ డెయిరీ ద్వారా అనేక ఉత్పత్తులను మార్కెట్లోకి తెచ్చామని చెప్పారు. పౌల్ట్రీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

సంపాదకీయం

వినకు వినిపించు

ఏ విషయాన్ని అయినా అట్టహాసంగా మార్కెటింగ్ చేయగల సత్తా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అపారంగా ఉంది. 2014 అక్టోబర్ మూడవ తేదీన ఆయన రేడియోలో "మన్ కీ బాత్" పేర నెలకు ఒకసారి ప్రసంగాలు చేయడం మొదలు పెట్టారు. ఆదివారం నాడు వందవ "మన్ కీ బాత్" ప్రసారం అవుతుంది. దీనికి కేంద్ర ప్రసార మంత్రిత్వ శాఖ ఎక్కడలేని హడావుడి చేస్తోంది. కమ్యూనిటీ రేడియో కేంద్రాలన్నీ ఈ వందవ "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని విధిగా ప్రసారం చేయాలని ఆదేశించారు. ప్రసారం చేసినట్టు రుజువులు కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపించాలట. జనం వింటున్న ఫొటోలు కూడా పంపాలట. వందవ "మన్ కీ బాత్" ప్రసారం అవుతున్న సందర్భంగా వంద రూపాయల నాణెం ముద్రిస్తున్నారు. దాన్ని ప్రధానమంత్రే విడుదల చేస్తారు. వందవ ప్రసంగానికి ప్రచారం కోసం ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో ఇటీవల ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ తాను ఇప్పటి దాకా ఒక్కసారైనా "మన్ కీ బాత్" వినకుండా ఉండలేదన్నారు. ఈ ప్రసంగాన్ని మోదీ రేడియో ద్వారానే కొనసాగించడానికి ఓ కారణం ఉంది. టీవీ ప్రసారాలకన్నా రేడియో ప్రసంగాలు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. దీని అర్థం రేడియో ప్రసంగాలు అందుబాటులో ఉన్న చోటల్లా రేడియో ప్రసారాలు వింటారని కాదు. అసలు జనం రేడియోలు వినడమే తగ్గిపోయింది. మార్కెట్లో రేడియోల అమ్మకాలు బాగా మందగించాయి. రేడియో కొనాలనుకునే వారు కాళ్ళు అరిగేట్టు తిరగాల్సిందే. చాలా మంది టీవీల మీదే ఆధార పడ్డున్నారు. "మన్ కీ బాత్" దూరదర్శన్‌లో ప్రసారం అవుతుంది. కానీ ఇది వినిపిస్తుంది. కనిపించదు. ఎందుకంటే మోదీ ప్రసంగం ప్రధానంగా రేడియో కోసం రూపొందించింది కనక దృశ్యం ఉండదు. 2015 జనవరి 27న "మన్ కీ బాత్" నాల్గవ ప్రసారానికి అప్పటి అమెరికా అధ్యక్షుడు అతిథి. 2019 సెప్టెంబర్ 29న ప్రసారానికి లతా మంగేష్కర్ ముఖ్య అతిథి. అంటే మోదీ తన ప్రసంగాలను ప్రచారంలో పెట్టడానికి ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటారో అర్థం అవుతోంది. "మన్ కీ బాత్" ప్రభావం ఎలా ఉందో తెలుసుకోవడానికి రోహ్‌తక్ లోని ఐ.ఐ.ఎం.తో సర్వే కూడా చేయించారు. ఈ సర్వేలో 100 కోట్ల మంది ఈ ప్రసారాన్ని విన్నట్టు తేలిందంటున్నారు. అన్ని ఆకాశవాణి కేంద్రాల నుంచి ఈ కార్యక్రమం నెలకు ఒకసారి ప్రసారం అవుతుంది. మోదీ వక్తృత్వ పటిమ నిజంగానే గొప్పది. చాలా సందర్భాలలో ఆయన మైక్‌ను కూడా లెక్క చేయకుండా గొంతు చించుకుని మాట్లాడుతుంటారు. కానీ "మన్ కీ బాత్" ప్రసంగాలు మాత్రం చాలా మంద్ర స్థాయిలో ఉంటాయి. చెవిలో ఏదో గుసగుస చెప్పినట్టు ఉంటుంది. ప్రసంగాలలో సారం కన్నా ప్రసంగించే తీరుకే మోదీ అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ కార్యక్రమంలో ఏయే అంశాలు ప్రస్తావించాలో సలహాలు కూడా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం అంటోంది. రోహ్‌తక్ ఐ.ఐ.ఎం. సర్వే ప్రకారం 23 కోట్ల మంది విడవకుండా ఈ ప్రసంగాలు వింటారట. 40 కోట్ల మంది అప్పుడప్పుడు వింటారట. ఇంత మంది ఈ ప్రసంగాల మీద అంత ఆసక్తి చూపుతుంటే ప్రభుత్వ ఆదేశాలు, నిర్దేశాలు ఎందుకో! ఆకాశవాణి, దూరదర్శన్, మై గవ్, పి.ఐ.బి. యూట్యూబ్ చానల్ మొదలైనవి "మన్ కీ బాత్" ప్రసారం చేస్తూ ఉంటాయి. 52 దేశ భాషల్లో, 11 విదేశీ భాషల్లో కూడా "మన్ కీ బాత్" ప్రసారం అవుతుంది. ప్రసారాలు విన్నవారిలో 60 శాతం మంది దేశ నిర్మాణం ఎలాసాగాలో సలహాలు కూడా చెప్పారట. ఈ కార్యక్రమం విన్న వారిలో 63 శాతం మందికి ప్రభుత్వం మీద సానుకూల అభిప్రాయం కల్గిందట. దేశాభివృద్ధి సాగుతున్న తీరు 73 శాతం మందికి ఆశావహంగా ఉందట.

రోహ్‌తక్ ఐ.ఐ.ఎం. సర్వే ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ "మన్ కీ బాత్" గురించి తెలియని వారి సంఖ్యే ఎక్కువ. ప్రధానమంత్రి చానల్, బీజేపీ యూట్యూబ్ చానెలను చూసినా "మన్ కీ బాత్" మీద ఆదరణ ఎంత తక్కువగా ఉందో అర్థం అవుతుంది. ఈ కార్యక్రమానికి వ్యాపార ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయమూ తగ్గుతోంది. సి.ఎస్.డి.ఎస్. సంస్థ జరిపిన సర్వేలో కూడా "మన్ కీ బాత్" గురించి ప్రస్తావనఉంది. ఈ సంస్థకు ప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్తలు సంజయ్ కుమార్, సుహాస్ పల్శీకర్, సందీప్ శాస్త్రివంటి వారు సలహాదారులుగా ఉన్నారు. ఈ సర్వే ఫలితాలు గత నవంబర్‌లో విడుదలయ్యాయి. అయిదింట మూడొంతుల మంది "మన్ కీ బాత్" ప్రసంగం ఎన్నడూ వినలేదని ఈ సర్వేలో తేలింది. దక్షిణాది వారిలో ఈ కార్యక్రమంపై పెద్ద ఆసక్తిలేదు. హిందీ రాష్ట్రాలలో పరిస్థితి సైతం మరీ ఆనందపడవలసినంత ఏమీలేదు. టీవీ, ఇంటర్నెట్, స్టీరియో లాంటి సదుపాయాలు ఉన్న ఇళ్లల్లోనూ ఈ కార్యక్రమాన్ని విన్న ప్రతి పదిమందిలో ముగ్గురు మాత్రమే ఒకసారో, రెండు సార్లో ఈ కార్యక్రమం విన్నారు. మోదీ మీద అభిమానం ఉన్న వారిలో సగంమంది ఈ ప్రసంగం వినడం లేదట. సి.ఎస్.డి.ఎస్. సర్వే ప్రకారం హిందీ మాట్లాడని రాష్ట్రాలలో 62 శాతం మందికి ఈ కార్యక్రమం గురించి తెలియదు. హిందీ మాట్లాడే రాష్ట్రాలలో సగం మంది, ఉత్తరాది రాష్ట్రాలలో సగం మంది ఈ కార్యక్రమాన్ని ఆదరించడం లేదు. ఈ ప్రాంతాలు బీజేపీకి పట్టున్నవి అయినా ఉన్న పరిస్థితి ఇదే. బీజేపీకి పలుకుబడి ఉన్న చోట్ల కూడా 51 శాతం మంది దీన్ని పట్టించుకోవడం లేదు. 26 శాతం మంది ఒకసారి విన్నారు. ఇతర పార్టీల అభిమానుల్లో 68 శాతం మంది వినడం లేదు. అంతెందుకు ప్రధానమంత్రి సొంత రాష్ట్రమైన గుజరాత్ లోనైనా ఈ "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని పడిపడి వింటున్న దాఖలాలు లేవు. రేడియో వినే అలవాటు బాగా తగ్గిపోయినప్పుడు పరిస్థితి అద్భుతంగా ఉండడం సాధ్యం కాదు. తొమ్మిదేళ్ళ అధికారంలో ఉన్న ప్రధాని మోదీ ఒక్కసారి కూడా పత్రికల వారితో సమావేశం ఏర్పాటు చేయలేదు. "ప్రజాస్వామ్యానికి మన దేశం తల్లి లాంటిది" అని ఊదరగొట్టే మోదీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేయకుండా "మన్ కీ బాత్" కోసం ఇంత ఆర్భాటం చేస్తున్నారంటే వినిపించడమే తప్ప వినే అలవాటు ఆయనకు లేదనేగా! వాస్తవాలతో మోదీకి ఎన్నడూ సంబంధం లేదు. తన ప్రచారం మీద, తన పలుకుబడి పెంచుకోవడం మీద ఆయనకు అపారమైన ఆసక్తి. అందుకే "మన్ కీ బాత్" వందవ ప్రసారానికి ఇంత హంగూ ఆర్భాటం.

సాధించిన హక్కులపై ఉక్కుపాదమేస్తున్నరు

పల్లవి

లెక్క లేని పని గంటలు ఒక్కటై ఎదిరించి
అలుపెరగని ఉద్యమాలు ఎరుపెక్కించినారు
ఎదిరించిన పోరులోన ఏరులై పారింది నెత్తురు
పారినట్టి నెత్తురులో ఎరుపెక్కిన ఎర్ర జెండా
ఎనిమిది గంటల పనిదినాలు సాధించినదినాడే
మేడే ఈ నాడే కార్మికుల పండుగ దినమీనాడే

సాధించిన హక్కుల పై ఉక్కు పాదమేస్తున్నరు
యజమానుల క్రమదోపిడి పై యంటుంది సర్కారు
పనికి దగ్గ వేతనాన్ని పాతరెయ్య జూస్తున్నరు
కొత్తకొత్త చట్టాలతో కార్మికుల కదుపుగొట్టి
కార్పోరేట్ శక్తులకు గులామై సలామ్ జేస్తున్నది

చికాగో నగరంలో చిందించిన రక్తంతో...
తెచ్చుకున్న హక్కులకు ఉరితాళ్లను బిగిస్తూ...
నలబై నాలుగు చట్టాలను రద్దు జేస్తూ..మోదీ
సర్కారు నేడు నాలుగు కోడులుగా మార్చి..
కార్పోరేట్ పెద్దలకు ఊడిగం జేస్తున్నది
కార్మికులు ఏకమై కదులుదాము రథచక్రాలై

ఎనిమిది గంటల పనిదినాలను...
ప్రభుత్వరంగ కంపెనీలను...
కాపాడగ కదులుదాము..
కలసిమెలసి సాగుదాము..
సమరాలను నడుపుదాము..
గమ్యం ముద్దాడుదాము..

కార్పోరేట్ శక్తుల పై పరిమితి విధించమంటూ..
కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేయ నినదిస్తూ..
పనిజేసే కార్మికుల పర్మినెంట్ చేయాలని
లేబర్ కోడు లొద్దని.. రైతు చట్టాల రద్దు కొరకు
నిగ్గదీసి అడుగుదాము ఒక్కటై కదలి రండి
మేడే ఈ నాడే కార్మికుల పండుగ ఈ నాడే

కనీస వేతన జీవోలను ఏర్పాటు కావాలని
సమాన పనికి సమాన వేతనం కల్పించాలని
అసంఘటిత కార్మికులకు సంక్షేమ చట్టం-
మొకటి తేవాలని...
ఉత్పత్తి శక్తులైన కార్మికులు, కర్షకులు..
దిక్కులన్నీ పిక్కటిల్ల పిడికిలెత్తి కదలుదాము
మరో పోరాటానికి సమర శంఖమూదాము
ఏకమై పోరుదాము.. సాధించి తీరుదాము

– జి.చంద్రమోహన్ గౌడ్, 9866510399

కార్మికవర్గంపై దాడికి ప్రతిఘటన

వెలుగూరి రాధాకృష్ణమూర్తి

చికాగో నగరంలో 8గంటల పనిదినం కోసం కార్మికులు 1866 మే 4న సమావేశం కాగా పోలీసుల జోక్యంతో అక్కడ పరిస్థితి రక్తసిక్తమైంది. హఠాత్తుగా బాంబుపేలి ఓ పోలీసు మరణించగా పోలీసుల కాల్పుల్లో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడ జరిగిన పోరాటం ప్రపంచమంతా విస్తరించింది.

ప్రతి సంవత్సరం మే 1 వ తేదీన కార్మిక దినోత్సవం పాటించాలని, 1889లో 2 వ అంతర్జాతీయ కార్మిక సంస్థ యావత్ ప్రపంచ కార్మికవర్గానికి పిలుపునిచ్చింది. నాటి నుండి ప్రపంచంలోని అన్ని దేశాలలోని కార్మికులు, ఇతర శ్రామిక ప్రజలు మే డే జరుపుకుంటున్నారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే కమ్యూనిస్టు ప్రణాళిక ఇచ్చిన నినాదం భూగోళంపై మార్మోగింది. భారతదేశంలో మే డే మొదటిసారి 1923లో సింగారవేలు చెట్టియార్ నాయకత్వంలో మద్రాసులో కార్మికులు మే డే నిర్వహించారు. ఆతర్వాత, దేశమంతటా మే డే నిర్వహించాలని 1927లో ఏఐటీయుసి పిలుపునిచ్చింది. అప్పటి నుండి కార్మిక, ఉద్యోగ వర్గాలు దేశం నలుమూలలా మే డే ను పాటిస్తున్నారు. చికాగో కార్మికుల త్యాగాల స్ఫూర్తితో కార్మికవర్గ పోరాటాలు అనేక దేశాలలో ప్రజ్వరిల్లాయి. 8గంటల పనిదినం సహా పనిభద్రత, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మెహక్కు, కనీస వేతనాలు, బోనస్, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, ఇ.ఎస్.ఐ., సెలవులు, మెటర్నిటీ బెనిఫిట్ లాంటి సౌకర్యాలు, పనిప్రదేశంలో భద్రత, వర్కర్స్ కాంపెన్సేషన్ యాక్ట్, తదితర రాయితీలెన్నిటినో కార్మికవర్గం పోరాటంలతో సాధించుకుంది. సోవియట్, చైనా, క్యూబా, వియత్నాం సహా మరికొన్ని దేశాలలో కార్మిక, కర్షక ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అయితే, 1991లో సోషలిస్టు వ్యవస్థ కుప్పకూలాక పరిస్థితిలో తీవ్రమార్పు వచ్చింది. సామ్రాజ్యవాద అమెరికా నాయకత్వంలో ద్రవ్య పెట్టుబడి, విదేశీ కార్పొరేట్ పెత్తనం చెలాయింపు తీవ్రస్థాయికి చేరుకుంది. పెట్టుబడికి శ్రమను కట్టుబానిసగా మార్చే విధానాలు వెల్లువెత్తాయి. కార్మికవర్గ ప్రతిఘటన పెరిగింది. ఉత్పత్తిశక్తులు, ఉత్పత్తి సంబంధాల మధ్య వైరుధ్యం తీవ్రతరమైంది. పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్గత సంక్షోభంలో కూరుకుపోతోంది. అనేక దేశాల్లో ఫాసిస్ట్ శక్తులు అధికారంలోకివచ్చి కార్మిక వర్గ హక్కులపై తీవ్రదాడికి పాల్పడుతున్నాయి. అనేక త్యాగాలు, బలిదానాలతో కార్మికవర్గం సాధించుకున్న హక్కులు, ప్రయోజనాలను, కార్మిక చట్టాలను రద్దు చేస్తున్నారు. శ్రమ అమానుష దోపిడీకి గురవుతోంది. ప్రపంచవ్యాప్తంగా శ్రమకు, పెట్టుబడికి మధ్య భీకర పోరాటమే జరుగుతోంది.

భారతదేశంలో కార్మికవర్గ పరిస్థితి మరింత అమానవీయంగా ఉంది. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక, గత 100 సంవత్సరాలుగా అనేక త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4కార్మిక కోడ్స్‌ను అమల్లోకి తెస్తున్నారు. సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కులపై దాడి చేస్తున్నారు. 12 గంటల పనిదినం అమలుకు పూనుకుంటున్నారు. కనీసవేతనాల ఊసేలేకుండా చేస్తున్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, అప్రెంటిస్, ఫిక్స్‌డ్‌టరం ఎంప్లాయిమెంట్, దినసరి కూలీ పద్ధతులు అన్ని రంగాల్లో అమలు జరుపుతున్నారు.

ఉద్యోగాల రెగ్యులరైజేషన్ ప్రక్రియ మాటేలేదు. పనిప్రదేశాల్లో భద్రత, కార్మికసంక్షేమం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. హైర్ అండ్ ఫైర్ విధానం అమలోకి వచ్చింది. చట్టాలన్నింటినీ కార్పొరేట్లకు చుట్టాలుగా మార్చేశారు. కార్మికశాఖను నామమాత్రం చేశారు. 25 కోట్లమంది కార్మికులు దేశవ్యాప్తంగా అనేకసార్లు సమ్మెలుచేసి మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై సమరభేరి మ్రోగించారు. ప్రభుత్వం ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. కోవిడ్ కాలంలో దేశమంతా ప్రజలు తీవ్రకష్టాల్లో ఉండగా, బి.జె.పి. పాలిత రాష్ట్రాల్లో 3 సంవత్సరాలపాటు కార్మికచట్టాల అమలును నిలిపివేస్తూ ఆర్డినెన్స్‌లు తెచ్చారు. 12 గంటల పనిఋపులు, సమ్మెల నిషేధం అమలుకు ప్రయత్నించారు. సమైక్య కార్మికోద్యమం ఈ విధానాలను ప్రతిఘటించింది. ప్రభుత్వం జారీచేసిన ఈ ఆర్డినెన్సులు అవాంఛనీయమనీ, తక్షణమే ఉపసంహరించాలని ఐ.యల్.ఓ. సైతం భారతదేశాన్ని కోరింది. చివరకు, న్యాయస్థానాల జోక్యంతో ప్రభుత్వాలు వెనుకడుగు వేసిన తప్పలేదు.

సంపదను సృష్టించేది కార్పొరేట్లేననీ, సమాజం ముందుకు సాగటానికి కారణం వారేననీ, వారికి కావాల్సిన రాయితీలనిచ్చి, వారడిగిన కోర్కెలు తీర్చటం తమ ప్రభుత్వ విధానమని పాలకులు నిస్సిగ్గుగా పార్లమెంట్‌లోనే ప్రకటించటం దుర్మార్గం. వ్యాపారం చేయడం మా వ్యాపారం కాదని కూడా వారు ప్రకటించారు. ఆ విధంగా ప్రభుత్వరంగ సంస్థలపై తమ విముఖతను వెల్లడించుకున్నారు. ఈ భావజాలానికి అనుగుణంగానే బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చివేసింది. కార్మికవర్గాన్ని కట్టుబానిసలుగా మార్చేస్తూ ఉంది. ప్రభుత్వరంగ సంస్థలన్నిటినీ అయినకాడికి కార్పొరేట్లకు అప్పగిస్తూంది. "నగదీకరణ" పేరుతో ప్రభుత్వ ఆస్తులన్నింటినీ అతి తక్కువ ధరలకు అమ్మకానికి పెట్టింది. 2024 ఎన్నికల్లో తిరిగి బిజెపి అధికారంలోకొస్తే, ఆర్థికవ్యవస్థ తీవ్ర వినాశకర పరిస్థితి ఎదుర్కోవాల్సి ఉంటుందనీ, కార్మికులు, ఉద్యోగవర్గాల పరిస్థితి దుర్భరంగా మారుతుందనీ దేశంలోని యావత్ కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు ఒక అంచనాకు వచ్చాయి. అందువల్లనే, 2023 జనవరి 30 వతేదీ ఢిల్లీలో జరిగిన కేంద్ర కార్మికసంఘాల సదస్సు "నరేంద్రమోదీని గద్దె దించండి! దేశాన్ని కాపాడండి" నినాదంతో మహోద్యమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చింది. ఆ నినాదాన్ని సాకారం చేయడానికి ఈ మే డే సందర్భంగా ప్రతిన పూనుదాం.

వ్యాస రచయిత ఎఐటియుసి ఏపి గౌరవాధ్యక్షుడు

భారత్ విశ్వ గురువు ఎలా అయ్యింది?

డాక్టర్ దేవరాజు మహారాజు

భారతదేశంలోని కొందరు చక్రవర్తులు తమ మంత్రుల్ని, సేనాపతుల్ని ఎవరిని నియమించుకున్నారో, ఎవరిని నియమించుకున్నారో గమనించండి. వ్యక్తిగత అభిప్రాయాలు ఏవి ఉన్నా, వాటిని ఒక్క క్షణం పక్కనపెట్టి, సమదృష్టితో ఆలోచించి చూడండి. అక్బర్ చక్రవర్తి ముస్లిం రాజు కదా? అతని దగ్గర పనిచేసినవారు హిందువులైన తోడర్‌మల్, బీర్బల్, మాన్‌సింగ్ ! ఛత్రపతి శివాజీ హిందూ రాజు కదా? అతని దళపతిగా పనిచేసిన వాడు దర్యా సారంగ్, సేనాపతులు ఇబ్రహింఖాన్, దౌలత్‌ఖాన్‌లు అయినప్పుడు వీరు మతవాదులవుతారా? లౌకిక వాదులవుతారా? ఏకొంచెం ఇంగిత జ్ఞానం ఉన్నవారికైనా విషయం బోధపడుతుంది. ఆ తర్వాత ఔరంగజేబు సర్వసైన్యాధిపతి జయసింగ్. ఇక దక్షిణ భారతదేశంలో టిప్పుసుల్తాన్ దగ్గర ప్రధానిగా ఉన్నది పూర్ణయ్య. హైదరాబాదు బాద్‌షా కుతుబ్‌షా దగ్గర మంత్రులు అక్కన్న, మాదన్న, మరి వీరిని లౌకిక వాదులందామా? మతవాదులందామా?

సరే, ఈ విషయాలు అలా ఉండనిచ్చి–వీర శైవులు, వీర వైష్ణవుల మధ్య హోరాహోరీ పోట్లాటలు ఎందుకు జరిగాయి? ఇద్దరూ వైదిక మతాచారాలు పాటించేవారే కదా? మరి వీరి మధ్య మారణ హోమాలు, ఎందుకు జరిగాయి? వీరిలో మతవాదులెవరు, లౌకిక వాదులెవరు రస్సెల్ ఇప్పుడు ఆలోచించి తేల్చుకోండి! మనువాదులు అహింసావాదులు, అత్యాచారాలకు పాల్పడి, వారి తప్పుల్ని కప్పి పుచ్చుకోవడానికి గత కాలపు ముస్లిం పాలకుల్ని, ఈ కాలపు ముస్లిం పౌరుల్ని దుయ్యబడుతుంటారు. అర్థరహిత మైన వాదనలు చేస్తూ, అభూత పాలపుతుంటారు. ఒక క్రమ పద్ధతిలో విశ్లేషించుకుంటూ వస్తే, గతంలోనూ, ప్రస్తుతంలోనూ మనువాదులు చేసిన, చేస్తున్న దుర్మార్గాలు స్పష్టంగా కళ్లముందుంటాయి. ఇలాంటి వాస్తవ స్థితిగతులు నెమరువేసుకుంటూ దేశం విశ్వ గురువు కాలేదు. వీలైనంతవరకు అభూత కల్పనలు ప్రచారం చేసుకుంటూ, 'విశ్వగురువు' అయ్యామని అనుకుంటోంది.

దేశం విశ్వగురువుగా నిలబడాలంటే ఇదిగో ఇలాంటి కట్టుకథలు నమ్ముతూ బతుకుతుండాలి! ఉదాహరణకు కొన్ని చూద్దాం!!

రాముడు పాయసానికి పుట్టాడు. సీత భూమికి పుట్టింది. వినాయకుడు నలుగుపిండికి, పార్వతి మంచుకొండకు పుట్టారు. శ్రీ శుకుడు చిలుకకు, మాండవ్యుడు కప్పకు, శౌనకుడు కుక్కకు, అశ్వద్ధామ గుర్రానికి, విశ్వామిత్రుడు గాడిదకు, వాల్మీకి పుట్టకు, ఋష్యశృంగుడు జింకకు పుట్టారు! విష్ణుమూర్తి బొడ్డు లోంచి బ్రహ్మపుడితే, బ్రహ్మ మనసులోంచి సరస్వతి పుట్టింది. ఇకపోతే, ఆదిశక్తి గుడ్లుపెట్టగా త్రిమూర్తులు పుట్టారు కదా? మహాలక్ష్మి పాల సముద్రానికి, కర్ణుడు సూర్యుడికి పుట్టాడు. కట్టుకథల కల్పిత పురాణాల్లో జన్మవృత్తాంతాలు చాలా విచిత్రంగా ఉంటాయి. సరే, గొప్ప సృజనాత్మక రచనలంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. అవన్నీ నిజం. వాటిని మనస్ఫూర్తిగా విశ్వసించాలి. విశ్వసించి పూజించాలి. పూజించి, మోక్షం సాధించాలి. జన్మరాహిత్యం సాధించాలి. అని మత పండితులు, మత బోధకులు చెపుతూ ఉంటేనే చోద్యంగా ఉంటుంది. వారి అజ్ఞానానికి జాలి కలుగుతుంది.

ఒకవైపు ఆధునిక మానవులుగా జీవిస్తూ, మరోవైపు విచక్షణ జ్ఞానంలేని మానవజాతి 'తొలిదశలోని వారిగా' ఆలోచిస్తూ ఉంటే, బాధ కలుగుతుంది! వీరెప్పుడు ఆధునికంగా ఆలోచనను అందుకోగలరు? అని, అనిపిస్తుంది. వారి మెదళ్లను చుట్టుకుని ఉన్న మూఢత్వాన్ని బద్దలు కొట్టుకుని బైటపడితే గాని వారికి వాస్తవాలు అర్థంకావు. కానీ, ఏదీ పరిస్థితుల్లోనూ ఈ దేశ ప్రజలు బైటపడరు. ఈ దేశ నాయకులు బైటపడనీయరు. బైటపడితే దేశం విశ్వ గురువు కాకుండా పోతుందేమోనని,....వారికి బెంగ, బుగులు. తాము ఎలా చల్లినా ఫరవాలేదు. కానీ దేశం మాత్రం మూఢత్వానికే బ్రాండ్ ఎంబాసిడర్‌గా నిలబడాలన్నదే వారి కోరిక! ప్రపంచం నవ్విపోతున్నా పట్టించుకోకుండా 'తామే విశ్వగురువులమని' చెప్పుకు తిరుగుతుంటారు!

"వేదాలు 1.96 కోట్లకు పూర్వం వెలువడ్డాయి. ఓం అనే శబ్దతరంగాలే ప్రపంచంలోని అన్ని శబ్ద తరంగాలకు మూలం. సృష్టిగా ఉన్న ప్రకృతి ఓం శబ్దంతోనే చైతన్య వంతమవుతుంది. మానవ మస్తిష్క చైతన్యానికి ఓం శబ్ద తరంగాలే ముఖ్యం!" అని చెప్పుకుంటూ ఆత్మద్రోహం చేసుకోవడం తప్పిస్తే ఏదీ రుజువు కాలేదు. ఇలాంటి మూర్ఖత్వం వ్యాప్తిచేస్తూ పాపం దేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టాలని తాపత్రయ పడుతుంటారు. గత కాలపు పురాణాలే కాదు, వాటి సారాంశాన్ని నేటి వ్యాపార సినిమాలు కూడా తమ శాయశక్తులా ప్రచారం చేస్తున్నాయి. అఖండ, దేవి, నాగదేవత, పాతాళభైరవి, దయ్యం, పిశాచం, ఆత్మ మొదలైన ఫాంటసీ ఫిక్షన్‌కు సంబంధించినవి ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు చూపించే సినిమాలన్నీ సమకాలీన సమాజాన్ని తప్పుదారి పట్టించేవే. దర్శక, నిర్మాతలు, సినీ హీరోలు నమ్మకాలకు మరింత మూర్ఖత్వాన్ని, మూఢత్వాన్ని జోడించి ముఖ్యంగా సైన్సును వాడుతూ, సైంటిఫిక్ స్పిరిట్‌కు వ్యతిరేకంగా సినిమాలు తీస్తూ, జనావళిని అంధవిశ్వాసాల్లో ముంచడం క్షమించరాని నేరం! సమాజ ద్రోహం! బహుశా దేశం విశ్వగురువు కావాలంటే ఇలాంటి అసందర్భమైన, అసంగతమైన అబద్ధాల ప్రచారం కొనసాగాల్సిందేనేమో?

అనాదిగా సుప్రభాతం, సుప్రభాతం, సంకీర్తనం-దేవాలయ గోపురాల మీద, గోడల మీద అంతా శృంగారమే! ప్రపంచంలో ఇంతటి పచ్చి శృంగార భావనలు మరోచోట ఎందుకు లేవు? ఈ సనాతన, వైదిక, బ్రాహ్మణ సంస్కృతిలో మాత్రమే ఎందుకు ఉన్నాయి? ఆలోచించాల్సిన విషయం. దేశం విశ్వగురువు కావాలంటే ఈ పచ్చి శృంగారం తప్పదా? కన్నతల్లిలాంటి అమ్మవారిని 'జగదంబ చనువులు జాజర' చేయించిన అన్నమయ్యను ఏమనాలి? కన్నతల్లిలో కూడా శృంగారం చూసిన అన్నమయ్య, తరతరాల భక్తులకు కూడా ఆ శృంగారాన్నే చూపించాడు కదా? ఆ మాట అన్న అన్నమయ్యను తప్పుబట్టారు. ఆయనో భక్తాగ్రేసరుడయి పొయ్యాడు. ఆ మాటలో ఉన్న అసలైన అర్థం ఇదీ అని చెప్పిన వాడిది మాత్రం తప్పవుతుంది? వారెవా సనాతనమా? అయ్యారే ధాందనమా? దేశం విశ్వగురువు కావడమంటే మాటలా మరి? ఆధునిక నాస్తికోద్యమ నిర్మాత గోరా (15.11.1902– 26.07.1975) ఏమన్నారో ఒకసారి జాగ్రత్తగా గమనించండి. అంతే కాదు, సీరియస్‌గా ఆలోచించండి. "దేవుడనేది మానవుడు కల్పించిన అబద్ధం! దాని అబద్ధాల వలన గత కాలంలో అధికారంతవరకు ప్రయోజనకరంగా ఉంటే ఉండిందేమో! కానీ, అన్ని అబద్ధాల వలెనే ఇది కూడా రానురాను జీవితాన్ని కల్మషం చేసింది. కనుక, మానవ సంఘంలో అవినీతి అంతమై నీతి పెరగాలంటే దైవ విశ్వాసం పోవాలి! పోక తప్పదు!!" అబద్ధాలతో దేశం విశ్వగురువు ఎన్నటికీ కాలేదన్నది గ్రహించాల్సిన సారాంశం.

భారత్ 'విశ్వ గురువు' ఎలా అయిందంటే కొన్ని ఉదాహరణలు చూద్దాం! పేదరికంలో భారత్ నైజీరియాను అధిగమించింది. 2018లో నైజీరియాలో 8.7కోట్ల కటిక పేదలుంటే, భారత్‌లో 7.3కోట్ల కటిక పేదలు మాత్రమే ఉన్నారు. అలాగే, 2022లో నైజీరియాలో పేదలు 7కోట్లకు తగ్గిపోతే, భారత్‌లో కటిక పేదల సంఖ్య విపరీతంగా పెరిగి 8.3 కోట్లకు చేరింది. ఈ దేశప్రధాని రోజుకు 18గంటలు అవిశ్రాంతంగా పనిచేసి, దేశంలో దారిద్ర్యాన్ని ఘనంగా పెంచుతున్నారు. తమ హిందుత్వ భావజాలంతో దేశాన్ని విశ్వగురువు చేయాలని తాపత్రయ పడుతున్నారు. డాలర్‌తో మన రూపాయి మారకం 2014లో 59గా ఉంటే, 2022లో 80కి చేరింది. రూపాయి విలువ ఎంత పడిపోయిందో, దేశం అంత విశ్వగురువు అవుతుందన్న మాట! వంటగ్యాస్ 2014లో రూ.414 ఉంటే, 2022 నాటికి అది రూ.1053 కు పెరిగింది. సామాన్యుడి జీవితం ఎంత భద్రంగా ఉందో అంచనా వేసుకోవచ్చు. 2014లో ఈ దేశానికి అప్పు 58లక్షల కోట్లు ఉంటే, 2022లో దాన్ని గణనీయంగా 139 లక్షల కోట్లకు పెంచిన ఘనత బీజేపీ సూపర్ మ్యాన్, కాపలాదారు, చాయ్‌వాలా అయిన మోదీదే!

కేంద్ర సాహిత్య అకాడమీ విజేత, జీవశాస్త్రవేత్త

మాజీ ఎంపీ ఆనంద్‌మోహన్ విడుదలపై సుప్రీంకు ఐఏఎస్ కృష్ణయ్య భార్య

న్యూఢిల్లీ: హత్య కేసులో దోషి బీహార్ మాజీ ఎంపీ ఆనంద్‌మోహన్ విడుదల అంశం వివాదాస్పదంగా మారింది. 1994లో ఆనంద్‌మోహన్ నాయకత్వంలో కొంతమంది గుంపు నాటి ఐఏఎస్ అధికారి జి.కృష్ణయ్యను కొట్టిచంపింది. ఈ కేసులో ఆనంద్‌మోహన్ శిక్ష అనుభవిస్తున్నాడు. ఇటీవల ఆయనను బీహార్ ప్రభుత్వం జైలు నుంచి విడుదల చేసింది. తాజాగా ఆనంద్‌మోహన్ విడుదలను సవాల్ చేస్తూ కృష్ణయ్య భార్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శిక్ష పూర్తికాకుండానే ఆనంద్‌మోహన్‌ను ఎలా విడుదల చేస్తారని ఆమె ప్రశ్నించారు. బీహార్ జైలు నిబంధనలు సడలించి..ఆనంద్‌మోహన్‌ను గురువారం సహర్సా జైలు నుంచి విడుదల చేశారు. జీవితాంతం జైలులో ఉండాల్సిన ఆనంద్‌మోహన్‌ను ఇంత త్వరగా ఎలా విడుదల చేస్తారని కోరుతూ కృష్ణయ్య భార్య ఉమా కృష్ణయ్య సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశించినట్లు ఆనంద్‌మోహన్ జీవితఖైదు అనుభవించాల్సి ఉండగా క్షమాభిక్ష పేరుతో ముందుగా విడుదల చేశారని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయశాఖ నోటిఫికేషన్ ప్రకారం విడుదల చేసిన 20 మంది ఖైదీల జాబితాలో మోహన్ పేరు ఉంది. 14 ఏళ్లు పైబడి శిక్ష అనుభవించిన ఖైదీలకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించింది.

ప్రమాదంలో ఇద్దరు ఆర్మీ జవాన్ల మృతి

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో శనివారం ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్మీ జవాన్లకు సంబంధించిన అంబులెన్స్ కేరి సెక్టార్ వద్ద రోడ్డుప్రమాదానికి గురైంది. అతి వేగంతో దూసుకొచ్చిన అంబులెన్స్ అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు జవాన్లు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు ఆర్మీ ఉన్నతాధికారులు వెల్లడించారు. అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని సైనిక ఉన్నతాధికారులు ప్రకటించారు. సిక్కింలో గతేడాది డిసెంబర్‌లో ఆర్మీ జవాన్లు వెళ్తున్న వాహనం ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 16 మంది ఆర్మీ జవాన్లు ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే.

లెఫ్టినెంట్‌గా నాయక్ దీపక్ భార్య నియామకం

న్యూఢిల్లీ : 2020లో చోటు చేసుకున్న గాల్వన్ వ్యాలీ ఘర్షణల్లో ప్రాణాలుకోల్పోయిన నాయక్ దీపక్ భార్య భర్తను స్ఫూర్తిగా తీసుకొని ఆర్మీలో చేరారు. నాయక్ దీపక్ భార్య రేఖా సింగ్ ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్‌గా నియామకం అయినట్లు భారత ఆర్మీ అధికారులు శనివారం వెల్లడించారు. లఢక్‌లోని ఎల్ఏసీ వద్ద రేఖా సింగ్ విధులు నిర్వర్తించనున్నారు. చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో రేఖా సింగ్ ఏడాది పాటు శిక్షణ తీసుకున్నారు. ఆ శిక్షణ నేటితో ముగిసిందని ఆర్మీ అధికారులు చెప్పారు. ఈ సందర్భంగా రేఖా సింగ్‌కు కుటుంబ సభ్యులు, ఆర్మీ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. బీహార్ రెజిమెంట్‌కు చెందిన 16వ బెటాలియన్‌లో పని చేస్తున్న నాయక్ సింగ్‌కు మరణానంతరం వీర్ చక్ర అవార్డును కేంద్రం 2021లో ప్రకటించిన సంగతి తెలిసిందే.

బైజూస్ ఆఫీసుల్లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: రవీంద్రన్ బైజూ, ఆయన కంపెనీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం సోదాలు చేస్తోంది. ఫెమా చట్టం కింద బెంగుళూరులోని మూడు ప్రదేశాల్లో ఆ తనిఖీలు జరుగుతున్నాయి. థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆన్‌లైన్‌లో బైజూస్ పేరుతో విద్యను బోధిస్తున్న విషయం తెలిసిందే. ఈడీ దాడుల సమయంలో విస్తుపోయే డాక్యుమెంట్లను, డిజిటల్ డేటాను స్వాధీనం చేసుకున్నారు. బైజూస్ కంపెనీకి సుమారు 28 వేల కోట్ల విదేశీ పెట్టుబడి వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2011 నుంచి 2023 మధ్య కాలంలో ఆ మొత్తం జమా అయినట్లు ఫెమా సోదాల్లో తేలింది. ఇదే కాలంలో కొన్ని విదేశీ కంపెనీలకు సుమారు 9754 కోట్లు రెమిట్ చేసినట్లు కూడా బైజూస్‌పై ఆరోపణలు ఉన్నాయి.

దేశంలో తొలి తీగల రైల్వే వంతెన సిద్ధం

శ్రీనగర్: భారతరైల్వేశాఖ మరో ఘనత సాధించేందుకు చేరువైంది. జమ్మూలోని రైసీ జిల్లాలో చేపట్టిన దేశ మొట్టమొదటి తీగల రైల్వే వంతెన నిర్మాణం సిద్ధమైందని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. 11 నెలల వ్యవధిలో ఈ కేబుల్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసినట్లు ఆయన ట్విటర్ వేదికగా వెల్లడించారు. వంతెనను మొత్తంగా 96 ప్రధాన తీగలతో అనుసంధానించినట్లు రైల్వే మంత్రి చెప్పారు. మొత్తం తీగల పొడవు 653 కిలోమీటర్లు ఉందని తెలిపారు. తీగల అమరిక పనులకు సంబంధించిన వీడియోనూ ఈ సందర్భంగా పోస్ట్ చేశారు.

ఈ ట్వీట్‌పై స్పందించిన ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్సలెంట్' అని ప్రశంసించారు. సుమారు రూ.400 కోట్ల వ్యయంతో ఈ వంతెన పనులు చేపట్టారు. మొత్తం పొడవు 725 మీటర్లు. అంజీఖడ్ తీగల రైల్వే వంతెన జమ్మూ- బారాముల్లా మార్గంలోని కాట్రా- రైసీ సెక్షన్లను కలుపుతుంది. హిమాలయ పర్వతాల మధ్య అంజీఖడ్ నదిపై దాదాపు 1086 అడుగుల ఎత్తులో దీన్ని నిర్మించారు. ఈ బ్రిడ్జి 216 కిలోమీటర్ల వేగంతో వచ్చే గాలులను కూడా తట్టుకుంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ వంతెనను తొలుత చీనాబ్ నదిపై నిర్మించిన ఆర్చ్ బ్రిడ్జి తరహాలో నిర్మించాలనుకున్నారు. కానీ, భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చివరికి తీగల వంతెనను ఖరారు చేశారు.

నాలుగేళ్ల జైలు శిక్షతో లోక్‌సభ సభ్యత్వం కోల్పోనున్న బీఎస్పీ ఎంపీ

న్యూఢిల్లీ: రాజకీయవేత్తగా మారిన గ్యాంగ్‌స్టర్ ముక్తార్ అన్సారీ కి పదేళ్ల జైలుశిక్ష పడింది. కిడ్నాప్, హత్య కేసులో ఘాజీపూర్ కోర్టు ఆయనకు ఈ శిక్షను ఖరారు చేసింది. గ్యాంగ్‌స్టర్ చట్టం ప్రకారం అన్సారీపై కేసు వేశారు. 5 లక్షల జరిమానా కూడా చెల్లించాలని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు ఆదేశించింది. ముక్తార్ అన్సారీతో పాటు బీఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీపై కిడ్నాప్, హత్య కేసులు ఉన్నాయి. తీర్పు సందర్భంగా కోర్టు వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. 2005లో బీజేపీ ఎమ్మెల్యే కృష్ణానంద్ రాయ్ కిడ్నాప్, హత్య కేసులో గ్యాంగ్‌స్టర్ ముక్తార్ అన్సారీకి పదేళ్ల జైలుశిక్ష పడిన విషయం తెలిసిందే. ఈ శిక్షను ఘాజీపూర్ కోర్టు ఖరారు చేసింది. 5 లక్షల రూపాయల జరిమానా కూడా చెల్లించాలని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు ఆదేశించింది. ఈ కేసులో ముక్తార్ అన్సారీతో పాటు ఆయన సోదరుడు బీఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీ ని కూడా దోషిగా తేల్చిన కోర్టు.. ఆయనకు నాలుగేళ్లు జైలు శిక్ష విధించింది. దీంతోపాటు రూ. లక్ష జరిమానా విధించింది.

ముక్తార్ అన్సారీ అయిదుసార్లు ఎమ్మెల్యేగా చేశారు. విశ్వహిందూ పరిషత్ నేత నందకిశోర్ రుంగ్తాను 1996లో కిడ్నాప్ చేసినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఇక 2005లో బీజేపీ ఎమ్మెల్యే కృష్ణానంద రాయ్‌ను హత్యచేసినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. 2001లో జరిగిన ఉర్సీ చట్టి గ్యాంగ్‌వార్‌లో అన్సారీపై హత్య కేసు నమోదు అయింది. ఐపీసీ 302, 147, 148, 149 సెక్షన్ల కింద ఆ కేసు నమోదు చేశారు. అఫ్జల్ అన్సారీ ప్రస్తుతం ఘాజీపూర్ ఎంపీగా ఉన్నారు. కోర్టు తీర్పుతో ఆయన తన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోనున్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 8లోని ఆర్టికల్ 102(1)(ఈ) నిబంధన ప్రకారం రెండేండ్లు లేదా అంతకంటే ఎక్కువ జైలుశిక్ష పడిన వ్యక్తి తీర్పు వెలువడిన తేదీ నుంచి రాజ్యాంగ పదవుల్లో ఉండటానికి అర్హత కోల్పోతారు. జైలు శిక్షాకాలంతోపాటు మరో ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకూ అనర్హులవుతారు. సెక్షన్ 8లో పేర్కొన్న నేరాలకు ఈ అనర్హత వేటు వర్తిస్తుంది. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 2019 పరువు నష్టం కేసులో దోషిగా తేలడంతో కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నిబంధలన ప్రకారం లోక్‌సభ సెక్రటేరియట్ రాహుల్‌పై అనర్హత వేటు వేసింది. దీంతో ఆయన తన ఎంపీ సభ్యత్వాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

ఘాజీపూర్ ఎంపీ అఫ్జల్ అన్సారీ తన రాజకీయ జీవితాన్ని సీపీఐ తో ప్రారంభించారు. 1985లో మొదటిసారి ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 1989, 91, 93, 96 వరకు వరుసగా సీపీఐ తరఫున విజయం సాధించారు. అనంతరం 1996 ఎన్నికల్లో ఎస్పీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. 2002 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి చెందిన కృష్ణానంద్ రాయ్ చేతిలో ఆయన ఓడిపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో 2004లో పార్టీ ఆయనకు లోక్‌సభ టిక్కెట్ ఇచ్చింది. ఈ ఎన్నికల్లో బీజేపీకి చెందిన మనోజ్ సిన్హాపై విజయం సాధించారు. 2005 నవంబర్ 29న ఎమ్మెల్యే కృష్ణానంద్ రాయ్ హత్య తర్వాత ఆయనపై బలమైన కేసులు నమోదయ్యాయి. కోర్టులో ఎన్నో అభియోగాల అనంతరం ఆయన జైలుకు వెళ్లాడు. జైలుకు వెళ్లే సమయంలో సమాజ్ వాదీ పార్టీ తో రాజకీయ విభేదాల కారణంగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఘాజీపూర్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం ఆయన ఘాజీపూర్ ఎంపీగా ఉన్నారు.

కాంగ్రెస్ దూషణలే మాకు దీవెనలు

- నన్ను 91 సార్లు నిందించింది
- కర్నాటక ఎన్నికల ప్రచారంలో మోదీ

బెంగళూరు: కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్రమోదీ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ దూషణలే తనకు దీవెనలని వ్యాఖ్యానించారు. తనను నిందించిన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీనే పతనమవుతోందని మోదీ భగ్గుమన్నారు. ఇటీవల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ కర్నాటక ఎన్నికల ప్రచారాన్ని శనివారం నుంచి ప్రారంభించారు. 'కాంగ్రెస్ మళ్లీ నన్ను నిందించడం ప్రారంభించింది. నన్ను నిందించిన ప్రతిసారి... అది పతనమవుతోంది. కాంగ్రెస్, ఆ పార్టీ నాయకులు ఇప్పటికి 91సార్లు నన్ను అవమానించించారు. దుర్భాషలాడే పని కాంగ్రెస్‌ను చేసుకోనివ్వండి. నేను మాత్రం కర్నాటక ప్రజల కోసం పనిచేస్తాను. వారు లింగాయత్ వర్గాన్ని నిందించారు. అంబేద్కర్, వీర్ సావర్కర్‌ను అవమానించారు. వారి నిందలకు ప్రజలు ఓట్లతో బదులిస్తారు. బీజేపీపై ఎంత బురదచల్లితే... కమలం అంతగా వికసిస్తుంది' అని హుమ్నాబాద్ ఎన్నికల సభలో మోదీ అన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్రంలో ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కోసం కాదనీ, ఈ రాష్ట్రాన్ని దేశంలో నంబర్‌వన్‌గా చేయడానికని చెప్పుకొచ్చారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉంటే...రాష్ట్రం రెట్టింపు వేగంతో దూసుకెళ్తుందని వ్యాఖ్యానించారు. రెండురోజుల పర్యటనలో భాగంగా ప్రస్తుతం మోదీ కర్నాటకలో ఉన్నారు. శనివారం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించిన అనంతరం సాయంత్రం బెంగళూరు చేరుకున్నారు. బెంగళూరు నార్త్‌లో రోడ్ షోలో పాల్గొన్నారు. 'సామాన్యుల గురించి మాట్లాడినా, అవినీతిని వెలికితీసినా, స్వార్థ రాజకీయాలను ఎండగట్టినా కాంగ్రెస్ ద్వేషం పెంచుకుంటుంది. అలాంటివారిపై కాంగ్రెస్ ద్వేషం శాశ్వతం. ఈ ఎన్నికల్లోనూ నన్ను దూషించడాన్ని కాంగ్రెస్ మరోసారి ప్రారంభించింది. 'నాపై దుర్భాషకు సంబంధించిన జాబితాను కొంతమంది నాకు పంపారు. విభిన్నరూపాల్లో కాంగ్రెస్ నాయకులు ఇప్పటికి నన్ను 91 సార్లు దూషించారు. నన్ను తిట్టడానికి బదులు మంచి పాలన ఎలా ఇవ్వాలి...పార్టీ కార్యకర్తల్లో నైతికస్థైర్యం పెంచాలి వంటి వాటిపై దృష్టి సారిస్తే మంచిది' అని హితవు పలికారు. పేదల కోసం, దేశం కోసం కష్టపడి పనిచేసే వారిని అవమానించడం కాంగ్రెస్ చరిత్ర అని మోదీ నిందించారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓ విష సర్పం లాంటివారు. ఆయన తెచ్చిన పథకాలు చూసేందుకు ఆకర్షణీయంగా ఉన్నాయని రుచి చూస్తే చావు తప్పదు' అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇంతకుముందు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఆయన తన మాటల ఉద్దేశం వేరని వివరణ ఇచ్చుకున్నారు. మోదీని విష సర్పమని తాను అనలేదని, ఆ పార్టీ విధానాలు విషపూరితమని మాత్రమే అన్నానని ఖర్గే వివరించారు. దీనికి సమాధానంగా బీజేపీ నేత ఒకరు కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని విషకన్య అంటూ వ్యాఖ్యలు చేశారు.

కేంద్రమంత్రి షెకావత్‌ను తొలగించండి

సికర్: కేబినెట్ నుంచి కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను తొలగించాలన్న డిమాండ్‌ను రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ పునరుద్ఘాటించారు. సంజీవని క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ కేసుతో షెకావత్, ఆయన కుటుంబ సభ్యులకు సంబంధం ఉందని గెహ్లాత్ చెప్పారు. అందువల్ల మంత్రిగా కొనసాగే నైతికహక్కు షెకావత్‌కు లేదని సీఎం స్పష్టంచేశారు. ఈ కుంభకోణం బాధితులు ఇప్పటికి మూడుసార్లు తనను కలిశారని, వారి కష్టసుఖాలు చెప్పుకున్నారని తెలిపారు. బాధితులను వ్యక్తిగతంగా కలవడం షెకావత్‌కు ఇష్టం లేకపోతే బాధితులతో తన సమావేశం వీడియో రికార్డింగ్‌ను కేంద్రమంత్రికి పంపుతానని చెప్పారు. ఈ కేసుకు సంబంధించి కేంద్రమంత్రి షెకావత్ ఇప్పటికే గెహ్లాత్‌పై ఢిల్లీకోర్టులో పరువునష్టం దావా వేశారు.

ఎన్నికల నేరాలు కర్నాటకలోనే అధికం

50శాతం కేసులు కోడ్ ఉల్లంఘనలవే: సీఈవో మనోజ్ కుమార్

బెంగళూరు: కర్నాటకలో ఎన్నికలప్పుడు జరిగే నేరాలు-ఆ కేసుల్లో శిక్షల శాతం ఎక్కువగానే ఉన్నదని ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) మనోజ్ కుమార్ మీనా అన్నారు. దాదాపు 50శాతం కేసులు ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించినవే అని చెప్పారు. 2013 నుంచి 2019 వరకు జరిగిన ఎన్నికల నేరాల వివరాలను వెల్లడించారు. కోడ్ ఉల్లంఘనల కేసులు నమోదైనప్పుడు ఎన్నికల సంఘం వాటిని నిశితంగా గమనిస్తుందని మీనా చెప్పారు. 'ఎన్నికల నేరాలు ఎక్కువగా జరిగే రాష్ట్రాల్లో కర్నాటక ఒకటి. గతసారి రెండువేల కేసులు ఈ రాష్ట్రంలో నమోదయ్యాయి. అన్నింటిలో చార్జిషీట్లు దాఖలయ్యాయి, విచారణలు జరిగాయి. దాదాపు 50శాతానికిపైగా కేసుల్లో శిక్షలుపడ్డాయి. మరే రాష్ట్రంలో శిక్షలు ఇంతలా పడినట్లు నాకు తెలియదు' అని పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో మీనా తెలిపారు. విద్వేష ప్రసంగాలపై దృష్టి పెట్టినట్లు మీనా చెప్పారు. టీవీ, సామాజిక మాధ్యమాలు, వార్తాపత్రికలను గమనిస్తున్నాం. ఇందుకోసం ప్రతిస్థాయిలో ఒక బృందాన్ని ఏర్పాటు చేశాం అని సీఈవో తెలిపారు. మీడియా నిరంతర పర్యవేక్షణ కోసం కంట్రోల్ రూమ్‌నూ ఏర్పాటు చేశామన్నారు. 'మేము మా అధికారులకు కేసుల నిర్వహణ ప్రక్రియపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తాం. స్టాటిక్ స్క్వాడ్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలకు తనిఖీలు నిర్వహించడం, స్వాధీనం చేసుకోవడం వంటి అధికారాలు ఉంటాయి. ఏ విధంగా తనిఖీలు చేపట్టాలి. ఎలా స్వాధీనాలు నిర్వహించాలి. కేసు ఎలా పెట్టాలి. కోర్టులో ఎలా ప్రవేశపెట్టాలి. కోర్టు అనుమతి ఎలా తీసుకోవాలి వంటివి నేర్పాం' అని సీఈవో వెల్లడించారు. ఎన్నడూ లేని విధంగా భారీగా నగదు, విలువైన వస్తువులు, ఉచితాలను పెద్దఎత్తున రాష్ట్రంలో ఈ మధ్యకాలంలో సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల తేదీల ప్రకటనకు దాదాపు నాలుగు నెలల ముందరే ప్రక్రియ మొదలైందని, వేర్వేరు సంస్థలతో సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు అధికారి చెప్పారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) ముందే ఖరారు కావడంతో మౌలికవసతులను ఎన్నికల తేదీల ప్రకటన సమయానికి సిద్ధం చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో కమిషన్ పర్యటన తర్వాత నిఘా కార్యకలాపాలను ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు మొదలు పెట్టాలని సీఈవో తెలిపారు. 'మేము అప్రమత్తంగా ఉంటాం. వచ్చే 14రోజులు కీలకం. సరిహద్దుల్లో నూటికి నూరుశాతం తనిఖీలు జరుగుతున్నాయి. అంతర్గత కదలికలపై నిఘాపెట్టాం. క్షేత్రస్థాయిలో ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సేకరిస్తున్నాం. మొబైల్ యాప్ 'ఈ-విజిల్' ద్వారా ప్రజల నుంచి కమిషన్‌కు సహకారం ఉంది' అని మీనా వెల్లడించారు. మార్చి 29న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.292.06 కోట్లను స్వాధీనం చేసుకున్నట్లు మీనా కార్యాలయం వెల్లడించింది.

అభ్యర్థులకు బీజేపీ ప్రలోభాలు

అప్రమత్తంగా ఉండాలని ఈసీ ఆదేశం

న్యూఢిల్లీ: క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కర్నాటక ముఖ్య ఎన్నికల అధికారిని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. డబ్బుల పంపిణీ, అభ్యర్థుల బెదిరింపు, ఓటర్ల ప్రలోభపెట్టడం వంటి చర్యలపైనా, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపైనా నిఘాను పెంచాలని శనివారం స్పష్టంచేసింది. ఎన్నికల బరి నుంచి తప్పుకోవాలని, ఇందుకుగాను డబ్బు, వాహనం ఇస్తానని జేడీఎస్ అభ్యర్థి మల్లికార్జున స్వామి అలియాస్ ఆలూరు మల్లును చామరాజ్‌నగర్ బీజేపీ అభ్యర్థి వి.సోమన్న ప్రలోభ పెట్టినట్టు సోషల్ మీడియాలో ఓ క్లిప్పింగ్ హల్‌చల్ చేసిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి చామరాజ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైనట్లు వెల్లడించాయి. ముడుపులు ఇవ్వడం, ప్రలోభానికి గురిచేయడానికి సంబంధించిన సెక్షన్లను ప్రయోగించారు.

ఆ ఫైళ్లు పంపండి

కేజ్రీవాల్ ఇంటి పనులపై ఎల్‌జీ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అధికారిక నివాసం మరమ్మతుల వ్యవహారంపై వివాదం కొనసాగుతున్న వేళ...దీనికి సంబంధించిన వివరాలన్నింటినీ నివేదిక రూపంలో అందజేయాలని అధికారులను లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా శనివారం ఆదేశించారు. ఇందుకుగాను 15 రోజుల గడువు విధించారు. ఢిల్లీ సివిల్ లైన్స్ ఏరియాలోని ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులో కేజ్రీవాల్ నివాసం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారని మీడియాలో వచ్చిన వార్తలను పరిగణనలోకి తీసుకున్న లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా...ఇందుకు సంబంధించిన ఫైళ్లను తన పరిశీలనకు పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి నివాసం పునర్నిర్మాణం కోసం ఆప్, ఢిల్లీ సీఎం రూ.45 కోట్లు ఖర్చు చేసినట్టు బీజేపీ విమర్శలు చేసింది. ఇందులో అవినీతి చోటుచేసుకుందని ఆరోపించింది. రూ.10 కోట్లు ఖర్చు దాటితే లెఫ్టినెంట్ గవర్నర్ పరిశీలన పరిధిలోకి వస్తుందని, ఆయన పరిధిలోకి రాకుండా చూసేందుకు తక్కువ ఖర్చు చూపించారని బీజేపీ ఆరోపించింది. ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ ఖర్చు రూ.9.99 కోట్లు. ఇంత కచ్చితంగా ఎలా లెక్కలు వేశారు? ఇది తెలివిగా మదింపు చేసిన లెక్కగానే చెప్పాలి. దీని ఆధారంగా అవినీతి జరిగినట్టు తేలుతోంది. ఆప్ అవినీతిని ఇది బహిర్గతం చేస్తోందని బీజేపీ జాతీయ ప్రతినిధి సుధాన్షు త్రివేది ఆరోపించారు. కరోనా సమయంలో అన్ని నిర్మాణాలు, పరిశ్రమల ఉత్పత్తి నిలిచిపోయాయని, రాష్ట్ర ఆదాయం సైతం సగానికి తగ్గిపోయిందని, ప్రజలు కష్టాలు పడుతున్న సమయంలో కోట్లాది రూపాయలతో నిర్మాణం జరపడం ఏమిటని బీజేపీ ప్రశ్నించింది. ఈ ఆరోపణలను ఆప్ కొట్టివేసింది. బీజేపీ అనేక ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం నివాసానికి రూ.45 కోట్లు ఖర్చు చేశారంటూ యాగీ చేస్తోందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. పుల్వామా దాడి, అదానీ వివాదం వంటి అంశాలపై సీఎం నివాసంలో చర్చ జరక్కుండా చేసేందుకు బీజేపీ ఈ ప్రయత్నాలకు దిగిందని మండిపడింది. 1942లో కట్టిన 80 ఏళ్ల క్రితం నాటి భవనం ఇదని, ఒక్కసారి కాదు..మూడుసార్లు పైకప్పు కూలిపోయిన ఘటనలు ఇంతకుముందు చోటుచేసుకున్నాయని సంజయ్ సింగ్ వివరించారు.

నాలుగేళ్ల హానర్స్ కోర్సుపై లేని స్పష్టత

- ఉత్తర్వులు జారీచేయని బెంగాల్ విద్యాశాఖ
- కాలేజీలు, యూనివర్సిటీ వర్గాల్లో గందరగోళం

కోల్‌కతా: కొత్త విద్యా విధానం ప్రకారం యూజీలో నాలుగేళ్ల హానర్స్ కోర్సును ప్రారంభించాలనే విషయంలో స్పష్టత లోపించడం వల్ల కళాశాలలు, విశ్వవిద్యాలయాల యాజమాన్యాలు గందరగోళానికి గురవుతున్నారు. ఈ కోర్సును ప్రారంభించాలంటే ఎలాంటి ఏర్పాట్లు చేసుకోవాలనే ఆలోచనలో పడ్డాయి. ఇప్పటివరకు అధికారిక ఉత్తర్వులు లేకపోవడం ఆందోళనకు లోనవుతున్నాయి. పశ్చిమ బెంగాల్ హయ్యర్‌సెకండరీ పరీక్షల ఫలితాలు నెల తర్వాత వెలువడనుండగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో నాలుగేళ్ల హానర్స్ కోర్సు ప్రారంభించేందుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు ఇప్పటివరకు కళాశాలలకు అందలేదు. 'ఉన్నత విద్యాశాఖ ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు జారీచేయలేదు. కొత్త కోర్సు కోసం ఏర్పాట్లు చేయాలంటే కాలేజీలు, యూనివర్సిటీలకు మౌలికవసతులు అవసరం' అని బెంగాల్ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు చీరన్‌జిబ్ భట్టాచార్య తెలిపారు. జాతీయ విద్యా విధానం-2020లోని కొన్ని కీలకాంశాల అమలు విషయంలో నిపుణుల్లో ఏకాభిప్రాయం ఉన్నదని విద్యామంత్రి బ్రత్యబసు ఇటీవల అనేకసార్లు చెప్పారు. మూడేళ్లకు బదులు నాలుగేళ్ల యూజీ-హానర్స్ కోర్సు, రెండేళ్లకు బదులు ఏడాది పీజీ కోర్సు, 3+2 ఫార్మాట్ స్థానంలో 4+1 ఫార్మాట్ వంటివి కొత్త విద్యా విధానం సూచించింది. దీనిపై కలకత్తా యూనివర్సిటీ ఆపద్ధర్మ వీసీ ఆసిస్ కుమార్ చటర్జీ మాట్లాడుతూ 'లాభ-నష్టాలు అంచనా వేసుకున్న తర్వాత కొన్ని సిఫార్సులను ఉన్నత విద్యాశాఖకు పంపాం. వాటిపై అధికారులు సాధ్యమైనంత త్వరగా సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నాం' అని అన్నారు. ఈయనతో నగరంలోని అనేక కళాశాలల ప్రధానోపాధ్యాయులు ఏకీభవించారు. స్టాటిష్ చర్చి కాలేజి ప్రిన్సిపల్ మోదుమంజరి మొండల్ మాట్లాడుతూ 'ఈ నెలారంభంలో సీయూ-అనుబంధ కాలేజి ప్రిన్సిపల్ల వర్క్‌షాప్ జరిగింది. తర్వాత ఉన్నత విద్యశాఖ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. హయ్యర్ సెకండరీ, ప్లస్-2 బోర్డు పరీక్షలకు ముందే సమగ్ర సమాచారం లభిస్తుందని ఆకాంక్షిస్తున్నాం' అని అన్నారు. ప్రభుత్వ కాలేజి లేడీ బ్రాబోర్న్ ప్రిన్సిపల్ సర్కార్ మాట్లాడుతూ నాలుగేళ్ల హానర్స్ కోర్సును ప్రారంభించడం గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి నోటిఫికేషన్ లభించలేదన్నారు. ఈ కోర్సును ప్రారంభిస్తే అది ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థుల కోసం మూడేళ్ల హానర్స్ కోర్సుతో పాటు కొనసాగుతుంది. కాబట్టి కరికులంలో దానిపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఆచార్య జగదీశ్ చంద్రబోస్ కాలేజి, విద్యాసాగర్ కాలేజి ప్రధానోపాధ్యాయులు కూడా ఈ కోర్సుపై ప్రభుత్వం నుంచి స్పష్టతను కోరుతున్నట్లు తెలిపారు. జాదవ్‌పూర్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్, ఆల్ బెంగాల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పందిస్తూ ఈ కోర్సును ప్రారంభిస్తే కీలక సబ్జెక్టులు ప్రాధాన్యతను కోల్పోతాయని, ఒకేషనల్ కోర్సులు ముఖ్యమైనవిగా మారుతాయని, ఇదంతా విద్య కార్పొరేటీకరణ కోసం జరుగుతోందన్నారు.

ఆర్టిలరీ రెజిమెంట్‌లోకి మహిళా అధికారులు

న్యూఢిల్లీ: దేశ చరిత్రలో ఆర్టిలరీ రెజిమెంట్‌లోకి సైన్యం తొలిసారిగా ఐదుగురు మహిళా అధికారులను తీసుకున్నది. చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా అధికారులు శనివారం ఆర్టిలరీ రెజిమెంట్‌లో చేరారు. ఆర్టిలరీ రెజిమెంట్‌లో చేరిన మహిళా అధికారుల్లో లెఫ్టినెంట్ మెహక్ సైనీ, లెఫ్టినెంట్ సాక్షి దూబే, లెఫ్టినెంట్ అదితి యాదవ్, లెఫ్టినెంట్ పవిత్రా మౌద్గిల్ ఉన్నారని అధికారులు తెలిపారు. ఐదుగురు మహిళా అధికారుల్లో ముగ్గురిని చైనా సరిహద్దు వెంబడి మోహరించిన యూనిట్లలో, మిగతా ఇద్దరిని పాక్ సరిహద్దుకు సమీపంలో 'సవాల్‌తో కూడుకున్న ప్రదేశాల్లో' నియమించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

ఆర్టిలరీ రెజిమెంట్‌లో మహిళా అధికారులను నియమించడం భారత సైన్యంలో వస్తున్న మార్పులకు నిదర్శనమని ఆ వర్గాలు పేర్కొన్నాయి. జనవరిలో ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ మనోజ్ పాండే ఆర్టిలరీ యూనిట్లలో మహిళా అధికారులను నియమించినట్లు జనవరిలో ప్రకటించారు. ఈ మేరకు సైన్యం ప్రతిపాదనలు కేంద్రానికి పంపగా.. ఆమోదం తెలిపింది. దాంతో తొలిసారిగా ఆర్టిలరీ రెజిమెంట్‌లోకి ఐదుగురు మహిళా అధికారులను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నది. చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో పాసింగ్ పరేడ్ జరిగింది. 189 క్యాడెట్స్ శిక్షణ పొందగా.. ఇందులో భూటాన్‌కు చెందిన 29 మంది క్యాడెట్స్ ఉన్నారు. ఈ పాసింగ్ అవుట్ పరేడ్‌ను బంగ్లాదేశ్ ఆర్మీ జనరల్ ఎస్ఎం షఫీయుద్దీన్ అహ్మద్ సమీక్షించి, క్యాడెట్స్‌ను అభినందించారు.

సాంస్కృతిక ఉద్యమ నిర్మాణం అవశ్యం

అమర కళాకారుల శతజయంతి సభలో వక్తల ఉద్ఘాటన

విశాలాంధ్ర-విశాఖ: దేశంలో నెలకొన్న పరిస్థితులపై సాంస్కృతిక పోరాటం నిర్వహించాల్సిన సమయం ఆసన్నమైందని డాక్టర్ సి.స్టాలిన్ అభిప్రాయపడ్డారు. విశాఖలో అమర కళాకారుల శత జయంతితో పాటు మహాకవి శ్రీశ్రీ 113వ జయంతి ఉత్సవాలు ఏపీ ప్రజానాట్యమండలి అధ్వర్యంలో శనివారం దాడి మహేశ్ కళా ప్రాంగణంలో (పౌర గ్రంథాలయం) ఘనంగా జరిగాయి. ప్రజానాట్యమండలి అభ్యుదయ గేయాలాపనతో జయంతి వేడుకలు ప్రారంభం కాగా అమర కళాకారులు సి.నాగభూషణం, విక్టరీ మధుసూదనరావు, పద్మశ్రీ అల్లు రామలింగయ్య చిత్ర పటాలకు అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు అధ్యక్షత వహించిన స్టాలిన్ మాట్లాడుతూ దేశంలో మత ఘర్షణలు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజానాట్య మండలి ఆవిర్భావం, అనంతరం నిర్వహించిన ఉద్యమాలను వివరించారు.

సాంస్కృతిక ఉద్యమ విస్తరణలో ప్రజానాట్యమండలి ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ అమర కళాకారుల శత జయంతి ఉత్సవాలు నిర్వహించు కోవడం ఆనందదాయకమన్నారు. నాగభూషణం, అల్లూరి, మధుసూదనరావు అసమాన కళాకారులని చెప్పారు. ప్రజా నాట్యమండలి పునఃనిర్మాణంలో అల్లు రామలింగయ్య చేసిన కృషి అజరామరమని వివరించారు. 1943లో ఏర్పడిన ప్రజానాట్యమండలి ప్రజలను చైతన్యవంతం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించిందని గుర్తుచేశారు. మధుసూదనరావు సినిమాల్లో అభ్యుదయ భావం ఉట్టిపడేదన్నారు. నాగభూషణం రక్తకన్నీరు నాటకాన్ని వేలాదిసార్లు ప్రదర్శించారన్నారు. స్థానిక సమస్యలను అవగతం చేసుకొని అన్ని అంశాలను నాటక రూపంలో ప్రదర్శించి ప్రజల మన్ననలు పొందడంలో నాగభూషణం మొదటి స్థానంలో ఉండేవారని గుర్తు చేశారు. ప్రజా నాట్యమండలి, కమ్యూనిస్టు పార్టీ కలిసి పనిచేసేవని చెప్పారు.

మాజీ శాసనసభ్యులు మానం ఆంజనేయులు మాట్లాడుతూ కళారంగంలో విప్లవాత్మక మార్పు కోసం ప్రజానాట్యమండలి ఎంతో కృషి చేసిందని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థ అత్యంత ప్రమాదంలో పడిందని, ప్రజానాట్యమండలి కళాకారులు... కళా ప్రదర్శన ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దిన చరిత్ర ప్రజానాట్యమండలికి దక్కిందన్నారు. కళాకారులందరినీ కలుపుకొని ముందుకు పోవడానికి ప్రజానాట్యమండలి కృషి చేయాలని సూచించారు. ప్రజల నుంచి కళాకారులు తయారవ్వాలని, పాలకుల నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా, మతతత్వవాదానికి వ్యతిరేకంగా ప్రజానాట్యమండలి కళాకారులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సభ ప్రారంభానికి ముందు డేవిడ్ రాజు కళాకారుల బృందం ప్రదర్శించిన నాటకాలు ఆహూతులను అలరించాయి.

మధ్యాహ్నం జరిగిన మహాకవి శ్రీశ్రీ జయంతి సభకు అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సాహిత్య లోకాన్ని శ్రీశ్రీ సుసంపన్నం చేశారని, ఈ శతాబ్దం తనదని సగర్వంగా ప్రకటించిన కవి ఎవరైనా ఉన్నారంటే అది రెండక్షరాల శ్రీశ్రీకి మాత్రమే చెల్లుతుందన్నారు. ఆధ్యాత్మికత, ఆధ్యాత్మిక రచనలు, పద్యాల వైపు అడుగులు వేస్తున్న శ్రీశ్రీని పురిపండా అప్పలస్వామి అభ్యుదయ కవిత్వం వైపు మళ్లించారని తెలిపారు. అప్పటి నుంచి అభ్యుదయం వైపు, విప్లవం వైపు శ్రీశ్రీ తన ప్రయాణం కొనసాగించారని పేర్కొన్నారు. విశాఖపట్నంలో శ్రీశ్రీ పేరు మీద ఆడిటోరియం, అభ్యుదయ సాహిత్య కార్యక్రమాలకు థియేటర్ ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. దానికి సాహిత్యవేత్తలు కృషి చేయాలని సూచించారు. వచన కవిత్వంతో సామాన్య జనంలోకి కవిత్వాన్ని శ్రీశ్రీ తీసుకెళ్లారన్నారు. శ్రీశ్రీ, ఆరుద్ర తదితరులు విజయనగరానికి తరచూ రైల్లో వెళ్లి చాగంటి సోమయాజులు (చాసో) ఇంట్లో సాహిత్య చర్చలు జరిపే వారని తెలిపారు. విశాఖ ఏవీఎన్ కళాశాల తరువాత నిజాం సంస్థానంలో పనిచేసిన శ్రీశ్రీ చెన్నై వెళ్లి సినిమా రంగంలో ప్రవేశించి అనేక పాటలు రాశారన్నారు. ప్రేమ గీతాలు రాయడంపై వచ్చిన విమర్శలకు స్పందిస్తూ విప్లవమే తన ప్రేయసి అని శ్రీశ్రీ సగర్వంగా ప్రకటించారన్నారు. ఆచార్య చందు సుబ్బారావు మాట్లాడుతూ శ్రీశ్రీ సాహిత్య ప్రక్రియలో అన్ని వైపులా తన సృజనాత్మకతను చూపెట్టారన్నారు. సినిమా పాటల్లో సామ్యవాద భావాలను నిక్షిప్తం చేశారన్నారు. ఛందస్సు పద్యాలను కూడా శ్రీశ్రీ రాయగలరని, అయితే ఆయన వచన కవిత్వం వైపే మొగ్గు చూపారని చెప్పారు. అందువల్లే ఆయన సామాన్య ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్, తెలంగాణ ప్రజానాట్యమండలి నాయకురాలు పి.నళిని, నాయకులు బి.శివ, కాండ్రేగుల సత్యాంజనేయ, జి.కాసులరెడ్డి, కృష్ణన్న, అప్పన్న, స్వామి, జానకిరామ్, చిరంజీవి, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

వారి నిబద్ధత ఎనలేనిది

సూర్యనారాయణ, శ్రీనివాసరావు వీడ్కోలు సభలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: విశాలాంధ్ర దినపత్రికలో క్యాషియర్‌గా పని చేసిన సీరా సూర్యానారాయణ, ఎడ్వర్టైజ్‌మెంట్ విభాగంలో పని చేసిన చిట్టిబొమ్మ శ్రీనివాసరావు పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా శనివారం ఓ:విశాలాంధ్ర ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి మోదుమూడి మురళీకృష్ణ అధ్యక్షతన చంద్రం బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇరువురునీ విశాలాంధ్ర సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాలాంధ్ర దినపత్రిక పూర్వ సంపాదకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ సూర్యానారాయణ 30 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తూ తనకు ఇచ్చిన పనిని నిబద్ధతో పూర్తి చేసేవారని చెప్పారు. ఆయన తండ్రి, ఇతర కుటుంబ సభ్యులు కూడా విశాలాంధ్రలో అంకిత భావంతో పని చేశారని గుర్తు చేశారు. ఈ విధమైన వ్యక్తిత్వం, నమ్మకం కలిగిన వ్యక్తులు దొరకటం కష్టమన్నారు. విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిడి వచ్చినా తొకణకుండా నమ్మకంతో పని చేశారని చెప్పారు. ఎంతో క్లిష్టమైన క్యాషియర్ వర్క్‌ను ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా బాధ్యతగా నిర్వర్తించారని తెలిపారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్‌నాయుడు మాట్లాడుతూ, సూర్యానారాయణ, శ్రీనివాసరావు సంస్థకు అందించిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా సీరా సూర్యనారాయణను ఈడ్పుగంటి నాగేశ్వరరావు దుశ్శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు. చిట్టిబొమ్మ శ్రీనివాసరావును జీఎం హరినాథరెడ్డి దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. అనంతరం సీరా సూర్యానారాయణ, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు స్పందిస్తూ తనను ఆదరించిన విశాలాంధ్ర యాజమాన్యానికి, సహకరించిన సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. సీపీఐ విశాలాంధ్ర శాఖ కార్యదర్శి మధుసూదనరావు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు టీవీ సుబ్బయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సీపీ రాంబాబు, సర్క్యులేషన్ మేనేజర్ బి.సుబ్బారావు, ఎడిషన్ మేనేజర్ సాయిబాబు, విశాలాంధ్ర ఎంప్లాయాస్ యూనియన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'శాకుంతలం' నాకు పెద్ద జర్క్: దిల్‌రాజు



హైదరాబాద్: సమంత కీలక పాత్రలో గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'శాకుంతలం' తన 25ఏళ్ల సినీ నిర్మాణ కెరీర్‌లో పెద్ద జర్క్ అని ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు అన్నారు. గుణశేఖర్‌తో కలిసి ఆయన 'శాకుంతలం' నిర్మించిన సంగతి తెలిసిందే. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ సందర్భంగా ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దిల్‌రాజు అనేక విషయాలను పంచుకున్నారు. 'నా 25 సంవత్సరాల కెరీర్‌లో 'శాకుంతలం' పెద్ద జర్క్ ఇచ్చింది. ప్రేక్షకులు ఇచ్చిన తీర్పును స్వాగితిస్తా. సినిమాను నేను నమ్మాను. ప్రేక్షకులకు నచ్చితే ఆదరిస్తారు. ఒకవేళ నచ్చలేదంటే నా జడ్జిమెంట్ తప్పని అర్థం. ఆ పొరపాటు ఎలా జరిగిందో ఒకసారి చెక్ చేసుకోవడమే. 'శాకుంతలం'లో నా జడ్జిమెంట్ తప్పయింది. ఇంత సుదీర్ఘ కెరీర్‌లో 50కు పైగా సినిమాలను నిర్మిస్తే, ఫ్లాప్ అయినవి నాలుగైదు మాత్రమే ఉంటాయి. 'శతమానంభవతి' సమయంలో యూఎస్‌లో ఒకరోజు ముందుగానే వేశాం. అందరికీ నచ్చింది. 'శాకుంతలం' నాలుగు రోజులు ముందు షో వేశాం. మిశ్రమ స్పందన వచ్చింది. శుక్రవారం మార్నింగ్ షో అయిపోగానే పరిస్థితి అర్థమైంది. మొదటి రోజు ఆడియెన్స్‌తో కలిసి సినిమా చూస్తే, ఒక క్లారిటీ వచ్చేస్తుంది. సినిమా ఆడుతుందో లేదో తెలుస్తుంది. కొన్నిసార్లు డివైడ్ టాక్ రావచ్చు. కొంతమందికి నచ్చి, మరికొంతమందికి నచ్చకపోవచ్చు. ఎక్కువ మంది నచ్చలేదంటేనే అది ఫ్లాప్. అలాగే డిస్ట్రిబ్యూటర్స్ నుంచి కూడా ఫోన్లు రావడం లేదంటే అర్థం చేసుకుంటా. శుక్రవారం అయిపోతే ఆ సినిమా గురించి వదిలేస్తా. శనివారం నుంచి కొత్త సినిమాలపై దృష్టి పెడతా. తర్వాతి ప్రాజెక్టులు ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుంటా"అని చెప్పుకొచ్చారు. తమిళ రీమేక్ '96' విషయంలోనూ తన అంచనా తప్పయిందని దిల్‌రాజు చెప్పుకొచ్చారు. "ఆ సినిమా అల్లు అర్జున్, నాని సహా పలువురికి చూపిస్తే బాగుందని చెప్పారు. అయితే, కరోనా కారణంగా ఆ సినిమాను ఓటీటీలో ఎక్కువ మంది చూసేశారు. ఆ తర్వాత 'జాను' విడుదలైంది. '96' చూసిన ఫీల్‌ను ఈ సినిమాతో ఆస్వాదించలేకపోయారు. 'జాను', 'జెర్సీ' విషయంలో నాకు అర్థమైంది ఏంటంటే, ఓటీటీలో వచ్చేసిన తర్వాత ఏ సినిమాను రీమేక్ చేయకూడదు. ఈ రెండు సినిమాల గురించి అప్పటికి నిర్ణయం తీసుకోవడంతో వెనక్కి వెళ్లలేకపోయాం. ప్రస్తుతం రామ్‌చరణ్‌తో 'గేమ్ ఛేంజర్' చేస్తున్నాం. దీని తర్వాత ఎన్టీఆర్, ప్రభాస్‌లతో సినిమా ఉంటుంది. అయితే, వాళ్ల ప్రాజెక్టులు పూర్తయిన తర్వాతే మా సంస్థలో సినిమా ఉంటుంది" అని దిల్‌రాజు అన్నారు.

బీజేపీ ప్రమాదకర పాలన

రావుల వెంకయ్య విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: కేంద్రంలో బీజేపీ ప్రమాదకర పరిపాలన కొనసాగిస్తున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు రావుల వెంకయ్య విమర్శించారు. నల్లధనం తెస్తాం, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తాం, పెద్ద నోట్ల రద్దుతో భారతదేశాన్ని వెలిగిస్తామని ప్రగల్భాలు పలికిన మోదీ ప్రభుత్వం... దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతోందని మండిపడ్డారు. సీపీఐ, సీపీఎం ప్రచారభేరిలో భాగంగా శనివారం కందుకూరులో బహిరంగసభ జరిగింది. సీపీఎం నాయకురాలు మున్వర్ సుల్తాన్ అధ్యక్షత వహించారు. రావుల వెంకయ్య మాట్లాడుతూ రైతుల ఉద్యమ ఫలితంగానే నాలుగు నల్ల చట్టాలను మోదీ ప్రభుత్వం వెనక్కి తీసుకుందని గుర్తుచేశారు. స్వాతంత్ర్య పోరాటం గురించి తెలియని బీజేపీ నాయకులు...తామే నిజమైన సమరయోధులమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బీజేపీ కనుసన్నలలోనే జగన్ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. సీపీఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మోహన్‌రావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 9 ఏళ్లలో దేశాన్ని అతలాకుతలం చేసిందని దుయ్యబట్టారు. అదానీ వంటి బడాపారిశ్రామికవేత్తలకు ప్రధాని మోదీ దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. బీజేపీ పాలనలో భారతదేశం వందేళ్లు వెనక్కి వెళ్లిందని చెప్పారు. సీఎం జగన్ బెయిల్‌పై కొనసాగుతూ పరిపాలన చేస్తున్నారన్నారు. బెయిల్ రద్దు అయితే జైలుకు వెళ్లవలసి వస్తుందన్న భయంతో బీజేపీ జపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ పాలనకు అంతం పలికేందుకు సీపీఐ, సీపీఎం దేశవ్యాప్తంగా ప్రచార ఆందోళన చేస్తున్నాయన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య మాట్లాడారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేశ్‌బాబు, సహాయ కార్యదర్శి పి.బాలకోటయ్య, సీపీఎం నాయకులు ఎస్‌ఏ గౌస్, సీఐటీయూ నాయకురాలు సల్మా తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

బీజేపీ, వైసీపీ తీరు దారుణం: ఓబులేసు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ప్రజా ఉద్యమాలపై వైసీపీ ప్రభుత్వ వైఖరి దారుణంగా ఉందని, ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు స్పష్టంచేశారు. కడప వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ, సీపీఎం ప్రచారభేరి కొనసాగిస్తున్నామన్నారు. కడపలోని ఐటీఐ సర్కిల్ వద్ద ప్రచార భేరిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించడం విడ్డూరంగా ఉందని ఓబులేసు అన్నారు. దేశవ్యాప్తంగా ప్రచారభేరి విజయవంతంగా జరుగుతోందని, కానీ కడపలో మాత్రం పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. ఉద్యమ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం దారుణమన్నారు. ఇలాగైతే ఎస్పీకి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు మోదీ ప్రభుత్వం ధారాదత్తం చేయడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నదని చెప్పారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని పక్కన పెట్టి...ఉన్న పరిశ్రమలను మోదీ ప్రభుత్వం మూసివేస్తోందని విమర్శించారు. దీనివల్ల లక్షలాదిమంది ఉద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. మోదీ విధానాలను జగన్ ప్రభుత్వం గుడ్డిగా సమర్థించడం గర్హనీయమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగినా జగన్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రతిపక్ష టీడీపీ, జనసేన సైతం నోరెత్తడం లేదని మండిపడ్డారు. డా.అచ్చెన్న హత్యపై ఎస్పీ తీసుకున్న చర్యలేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని గుండెలు బాదుకున్న బీజేపీ...ఇప్పుడు చేస్తున్నదేమిటని నిలదీశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నగర కార్యదర్శులు వెంకటశివ, రాము మోహన్, జిల్లా నాయకులు వేణుగోపాల్, శ్రావణ్, సుధాకర్, మనోహర్, దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులు, బాదుల్లా, ఓబులేసు, చంద్రారెడ్డి, చంద్రశేఖర్, గంగా సురేశ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల దౌర్జన్యం

కేంద్రప్రభుత్వ పాలనకు నిరసనగా ప్రచారభేరి నిర్వహిస్తున్న సీపీఐ, సీపీఎం నిర్వహిస్తున్న సమావేశానికి పోలీసులు అడుగడుగునా అడ్డు తగిలారు. దీంతో పోలీసులు డౌన్‌డౌన్, పోలీసుల నిరంకుశత్వం నశించాలి, కడప ఎస్పీ డౌన్‌డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులకు, కమ్యునిస్టు పార్టీ నాయకులకు తీవ్రస్థాయిలో తోపులాట జరిగింది. సీపీఐ నాయకులు మైనుద్దీన్, సుబ్రమణ్యంలను దౌర్జన్యంగా వ్యాన్‌లో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, నగర నాయకులు వెంకటశివ పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. పోలీసుల తీరును కమ్యూనిస్టు నాయకులు తీవ్రస్థాయిలో ఖండించారు. జగన్‌కు, చంద్రబాబుకు, పవన్‌కల్యాణ్‌కు ఒకన్యాయం, కమ్యూనిస్టులకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. పదినిముషాలు సభ జరుపుకుంటామన్నా అనుమతించని పోలీసులు...ఆ నాయకులకు అర్ధరాత్రి వరకు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఎలా అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం మొత్తం పోలీసు వ్యవస్థ ఒకలా ఉంటే కడప జిల్లా పోలీసుల తీరు మరోలా ఉందని మండిపడ్డారు.

డా.సంజీవమ్మ దంపతులకు పరామర్శ

జీవని వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు డాక్టర్ పి.సంజీవమ్మ, డాక్టర్ టి.మాచి రెడ్డిలను జి.ఓబులేసు, ఉమామహేశ్వర రావు శనివారం వృద్ధాశ్రమానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంజీవమ్మ, మాచిరెడ్డి సాహితీ రంగానికి ఎనలేని కృషి చేశారన్నారు. వృత్తిరీత్యా సంక్రమించిన యావదాస్తిని జీవని వృద్ధాశ్రమం నిర్మాణం కోసం వెచ్చించడం అభినందనీయమన్నారు. వృద్ధాశ్రమంలో ఆహ్లాదకరమైన వాతావరణం, ఆధునిక సౌకర్యాలు, రుచికరమైన భోజనం, అభ్యుదయ సాహిత్యం అందుబాటులోకి తెచ్చి ఇంటి వాతావరణాన్ని తలపించేలా వృద్ధాశ్రమాన్ని తీర్చిదిద్దారని కొనియాడారు. జీవని వృద్ధాశ్రమం కడప జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా గల వృద్ధులు, సాహితీవేత్తలు చేరవచ్చన్నారు. వారి వెంట గాలిచంద్ర, జి.చంద్రశేఖర్ ఉన్నారు.

మోదీ, జగన్‌ను గద్దె దింపుదాం

ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: వచ్చే ఎన్నికల్లో మోదీ, జగన్ ప్రభుత్వాలను గద్దెదింపి దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఎం ప్రచారభేరిలో భాగంగా శనివారం ప్రకాశం జిల్లా కొండేపిలో నియోజకవర్గస్థాయి సదస్సు జరిగింది. సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు ఆర్ లక్ష్మి, మస్తాన్ అధ్యక్షత వహించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. కులాలు, మతాల మధ్య వైషమ్యాలు రెచ్చగొడట్టడమే కాకుండా దళితులు, మైనార్టీలపై దాడులను ప్రోత్సహిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడటాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. ఇప్పటికే మోదీ విధానాల వలన రాజ్యాంగానికే ప్రమాదం ఏర్పడిందని, 2024లో మరోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మనుస్మృతిని అమలు చేస్తారని హెచ్చరించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలు కుదేలయ్యాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా మారారని ఆరోపించారు. విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని సాధించలేకపోయారన్నారు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీ, ఉక్కు పరిశ్రమ, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టుకు నిధులు సాధించడంలో సీఎం జగన్ ఘోరంగా వైఫల్యం చెందారని అన్నారు. మరోపక్క విద్యుత్, చెత్త, ఆస్తి పన్ను, బస్సుచార్జీలు పెరిగాయన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందన్నారు. రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. ఆర్థికంగా, పారిశ్రామికంగా, విద్య, వైద్యపరంగా రాష్ట్రం వెనుకబడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను కమ్యూనిస్టులు నిరంతరం వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ప్రజల్లో చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు పూనాటి ఆంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, నాయకులు ఆర్.వెంకటరావు, కె.వీరారెడ్డి, సీపీఎం జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కబంధ హస్తాల్లో దేశ భవిత

జంగాల అజయ్‌కుమార్ విమర్శ

విశాలాంధ్ర-పెదకాకాని: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా పెదకాకానిలో సీపీఐ, సీపీఎం నియోజకవర్గ కార్యదర్శులు పుప్పాల సత్యనారాయణ, నల్లపనేని శివాజీ అధ్యక్షతన ఇక్కడ బహిరంగ సభ జరిగింది. జంగాల అజయ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా పేదలపై భారాలు వేస్తూ పెద్దలకు రాయితీలు కల్పిస్తోందని విమర్శించారు. కేంద్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచి పారిశ్రామిక, ఆర్థిక, రాజకీయ రంగాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిందన్నారు. చివరికి వ్యవసాయ రంగం సైతం కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాల్లో చిక్కుకున్నదని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం ప్రజల మధ్య కుల, మతాల చిచ్చు రాజేస్తున్నదన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, పోలవరం, రాజధాని నిర్మాణం తదితర అంశాలలో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసిందని గుర్తుచేశారు. ఇంత జరుగుతున్నా వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు మౌనం వహించడం దారుణమన్నారు. బీజేపీ విషకౌగిలి నుంచి ఆ పార్టీలు బయటకు రావాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకునేందుకు కేంద్రంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ప్రసంగించారు. నియోజకవర్గ సీపీఐ, సీపీఎం నాయకులు కేతినేని అగస్టీన్, డేవిడ్ రాజు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేను నిర్దోషిని... రాజీనామా చేయను

ఎలాంటి విచారణకైనా సిద్ధం- ఇదంతా కాంగ్రెస్ కుట్ర: బ్రిజ్‌భూషణ్

గోండా(యూపీ): జాతీయ స్థాయి మహిళా రెజ్లర్లు ఏడుగురిని లైంగికంగా వేధించిన వ్యవహారంలో ఎలాంటి విచారణను ఎదుర్కొనేందుకైనా తాను సిద్ధంగా ఉన్నట్లు డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ వెల్లడించారు. రాజీనామా మాత్రం చేసేది లేదని తెగేసి చెప్పారు. రాజీనామా చేయడమంటే ఆ ఆరోపణలు నిజమని ఒప్పుకోవడమే అవుతుందన్నారు. బ్రిజ్ భూషణ్ శనివారం ఉత్తరప్రదేశ్‌లోని గోండా నగరానికి 40కిమీల దూరంలోని బిష్ణోహర్పూర్‌లోని తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. 'నేను నిర్దోషిని. ఏ తప్పు చేయలేదు. సుప్రీంకోర్టు, ఢిల్లీ పోలీసులపై పూర్తి నమ్మకం ఉంది. ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నా. నా పదవికి రాజీనామా మాత్రం చేయను' అని అన్నారు. రెజ్లర్లతో కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా భేటీ కావడాన్ని ఖండించారు. 'ఈ వివాదం వెనుకున్నదెవరో నేడు తేలిపోయిందని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో ఓ పారిశ్రామికవేత్త, కాంగ్రెస్ హస్తం ఉన్నదని మొదటి నుంచి చెబుతూనే ఉన్నానన్నారు. వాళ్లు (కాంగ్రెస్) నాపై కోపంగా ఉన్నారని చెప్పిన బ్రిజ్ భూషణ్ అందుకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించలేదు. 'మహిళా రెజ్లర్ల డిమాండ్లన్నింటినీ అంగీకరించారు. నాపై ఎఫ్ఐఆర్ నమోదు అయినా వారు ధర్నా చేస్తున్నారు ఎందుకు? ప్రధాని మోదీకి, క్రీడామంత్రికి వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడుతున్నారు? అని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న ధర్నా రెజ్లర్లు చేస్తున్నది కాదు 'కుట్రదారులు' చేస్తున్నదని వ్యాఖ్యానించారు. దర్యాప్తు నివేదిక వెల్లడయ్యేంత వరకు ఆగకుండానే సుప్రీంకోర్టుకెళ్లారు. అక్కడ కొత్త ఆరోపణలు చేశారు. తమ ఆటను పరిరక్షించాలని అంటున్నారుగానీ వారి వైఖరి అందుకు ప్రతికూలంగా ఉన్నది. వారివల్ల నాలుగు నెలల్లో భారీ నష్టం జరిగింది' అని బ్రిజ్ భూషణ్ అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.